VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K. U.S.A., New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI MEMBER QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
: 91(40) 27628104, 27674007
: victoria.ashoknagar@gmail.com
: //www.victoriaoverseas.com

# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 సంచిక: 304, పేజీలు - 08

గురువారం, ఫిబ్రవరి 15, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

MAHESH KUMAR KOVURY CELL 9885624338
STOOP
TAILORS&TEXTILES
SUITING,SHIRTING&READYMADES
MEN'S WEAR&KID'S WEAR
18-3-4,
BESIDE OLD POLICE STATION,
CHATRINAKA

## ఉద్రిక్తంగా రైతుల ఆందోళనలు

- ఎక్కడికక్కడే కట్టడి చేస్తున్న పోలీసులు
- పోలీసుల డ్రోన్‌లను అడ్డుకునేందుకు పతంగులు ఎగరేసిన రైతులు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ రాజధాని ఢిల్లీలోకి ప్రవేశించేందుకు రైతులు రెండో రోజు కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సరిహద్దుల్లో తీవ్ర బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం అన్నదాతలను ఢిల్లీలోకి రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. మరోవైపు.. ఆందోళన చేస్తున్న రైతులు సరిహద్దుల్లో గుమిగూడకుండా భద్రతా బలగాలు పటిష్ఠ చర్యలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రైతులు కూడా కేంద్ర ప్రభుత్వం, భద్రతా బలగాల చర్యలను తిప్పికొట్టేందుకు సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సరిహద్దుల్లో పతంగులు ఎగుర వేస్తున్నారు. ఢిల్లీ ఛలో మెగా మార్చ్‌లో భాగంగా మంగళవారం పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో ఉన్న సింగు ప్రాంతంలో రైతులు, భద్రతా బలగాల మధ్య

6లో ▶

## పదేళ్లు నేనే సీఎం.. నువ్వెలా వస్తావో చూస్తా

### - సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో నిరుద్యోగులు ఎవ రూ అధైర్య పడొద్దని త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు బుధవారం ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించారు. తెలంగాణ కోసం పోరాడిన యువత ఈ రోజు ఉద్యోగాలు సాధించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. 'సీఎంగా ప్రమాణం చేసినప్పుడు ఎంత ఆనందం కలిగిందో ఇప్పుడు కూడా అంతే సంతోషంగా ఉంది. ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నుంచి యువతను గట్టెక్కిస్తున్నాం. గత ప్రభుత్వానికి తొమ్మిదన్నరేళ్లలో ఉద్యోగాలు భర్తీ చేయాలనే ఆలోచనే రాలేదు. అధికారులతో సమీక్షించి ఉద్యోగాల భర్తీకి అన్నీ ఆటంకాలు తొలగించాం.' అని పేర్కొన్నారు.

**పదేళ్లు నేనే సీఎం**

నిరుద్యోగ యువకుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని పదేళ్లు ఈ బాధ్యతలోనే ఉండి మీ కోసం 24 గంటలు కష్టపడి పనిచేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'తెలంగాణను కబళించడానికి గంజాయి ముఠాలు తిరుగుతున్నాయి. ఈ రాష్ట్రంలో గంజాయి మొక్కలు ఉండొద్దు. నిరుద్యోగ యువకులారా ఈ రాష్ట్రం మీదే. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న మీరు, మీకోసం పని చేయడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మీరు ఆశీర్వదిస్తే మరో

6లో ▶

## ఎన్నికల వరాలు "సిద్ధం"

### - రైతులు, మహిళలకు పండుగే



**అమరావతి (ప్రశ్న న్యూస్)** సీఎం జగన్ ఎన్నికల వరాల ప్రకటనకు సిద్ధమయ్యారు. ఇప్పటికే సిద్ధం సభల ద్వారా ఎన్నికల సమరశంఖం పూరించారు. మరో రెండు జాబితాలతో అభ్యర్థుల ఎంపిక ప్రకియ పూర్తి చేయనున్నారు. అటు ప్రతిపక్షాలు పొత్తులతో వస్తున్న వేళ తన సంక్షేమం - సామాజిక న్యాయం తనకు అధికారం నిలబెడతామనే నమ్మకంతో ఉన్నారు. అధికారంలోకి వస్తే అమలు చేసే హామీల ప్రకటన పైన జగన్ తుది కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 18న సిద్ధం సభలో ప్రకటించాలని నిర్ణయించారు.

**జగన్ వ్యూహాలు**

ముఖ్యమంత్రి జగన్ ఈ సారి ఎన్నికలకు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ప్రతిపక్షాలు పొత్తులతో వస్తున్న వేళ ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసామని వైసీపీ నేతలు చెబుతున్నారు. నాడు ఇచ్చిన

6లో ▶

## మీడియా పాయింట్ వద్దకు నో ఎంట్రీ

### - బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య వాగ్వాదం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీ నుంచి వాకౌట్ అయిన బీఆర్ఎస్ సభ్యులు అనంతరం లాబీల్లో నుంచి బయటకు వచ్చేశారు. అయితే, వారు మీడియా పాయింట్ వద్దకు వెళ్తున్న క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. మార్షల్స్, పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి మరీ వారిని నిలువరించారు. సభ జరుగుతున్నప్పుడు మీడియా పాయింట్ వద్దకు అనుమతి లేదనే నిబంధన ఉందని పోలీసులు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారితో వాగ్వాదానికి దిగారు. కొత్తగా ఈ రూల్స్ ఏంటంటూ హరీష్ రావు, కేటీఆర్ వాదించారు. స్పీకర్ నుంచి తమకు అలాంటి నోట్ రాలేదంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ది ప్రజా పాలన కాదని పోలీస్ పాలన అంటూ దుయ్యబట్టారు. సభలో మైక్ ఇవ్వరు.. ఇక్కడ కూడా

6లో ▶

## అబుదాబిలో హిందూ దేవాలయాన్ని ప్రారంభించిన ప్రధాని



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అబుదాబిలోని ఏకంగా 27 ఎకరాల్లో సువిశాలమైన బోచసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ (బాప్స్) మందిరాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. గల్ఫ్ దేశాల్లో నిర్మించిన తొలి హిందూ దేవాలయం ఇదే. ఈ సందర్భంగా మోదీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీని చూసేందుకు

6లో ▶

## తెలంగాణ బీజేపీఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి నియామకం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా ఏలేటీ మహేశ్వరరెడ్డిని ఆ పార్టీ హై కమాండ్ బుధవారం నాడు అధికారికంగా ప్రకటించింది. ఫ్లోర్ లీడర్‌తో పాటు మిగతా సభ్యులను కూడా అధిష్ఠానం నియమించింది. డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పాయల్ శంకర్, చీఫ్ విప్‌గా పాల్వాయి హరీష్ బాబు, విప్‌గా ధన్ పాల్ సూర్యనారాయణ, ట్రెజరర్‌గా పైడి రాకేష్ రెడ్డి, ఆఫీస్ సెక్రటరీగా రామారావు పాటిల్‌ను బీజేపీ హై కమాండ్ నియమించింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ 8 సీట్లను గెలుచుకున్న విషయం తెలిసిందే. కాగా ఏలేటి మహేశ్వర రెడ్డి నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో ఆయన ప్రజారాజ్యం పార్టీలో ఎమ్మెల్యేగా పనిచేశారు. అయితే అసెంబ్లీ బీఏసీ సమావేశానికి 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల్లో ఒకరిని పిలవాలని ఆ పార్టీ శాసనసభ్యులు స్పీకర్‌ను కోరారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డిని పిలవాలని బీజేపీ ఎమ్మెల్యేలంతా సంతకాలు చేసిన లేఖను స్పీకర్‌కు అందించిన విషయం తెలిసిందే. దీంతో బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వరరెడ్డి బీఏసీ సమావేశానికి హాజరయ్యారు. దీనిని బట్టి బీజేపీ శాసనసభా పక్షనేతగా ఏలేటి మహేశ్వరరెడ్డి పేరును బీజేపీ హై కమాండ్ ఖరారు చేసింది.
గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలలో రాజాసింగ్, ఏలేటి మినహా మిగతావారు తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాజాసింగ్ బీజేపీఎల్పీ నేతగా పనిచేశారు. అయితే వివాదాల కారణంగా రాజాసింగ్‌పై ఎన్నికలకు కొద్ది నెలల ముందు బీజేపీ వేటు వేసింది. పార్టీ నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. తిరిగి ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను బీజేపీ ఎత్తివేసింది. అయితే రాజాసింగ్ ఎప్పుడూ

6లో ▶

## తెలంగాణ అసెంబ్లీలో వాటర్ వార్

### - చచ్చిన పామును ఎవరైనా చంపుతారా?
### - కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీ వేడీ వాదనలు సాగాయి. ఇరిగేషన్ పై చర్చ సందర్భంగా సీఎం అభ్యంతర కర భాష వాడుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలు లేవనెత్తగా సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మంగళవారం నల్గొండ సభలో మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి అలాంటి భాష వాడొచ్చా అంటూ ప్రశ్నించారు. ఓ సీఎంను పట్టుకుని 'ఏం పీకనీకి పోయారా.?' అని అంటారా అంటూ నిలదీశారు. ఇదేనా తెలంగాణ సంప్రదాయం ఇది పద్ధతా.? అని మండిపడ్డారు. 'తెలంగాణ సమాజం పట్ల, రైతుల పట్ల గౌరవం ఉంటే ప్రధాన ప్రతిపక్షం మేడిగడ్డకు వచ్చేది. పదే పదే బీఆరెస్ నేతలు భాష గురించి మాట్లాడుతున్నారు. మాజీ సీఎం నల్లగొండలో మాట్లాడిన భాషపై చర్చిద్దామా?. మేడిగడ్డ

6లో ▶

## తెలంగాణలో భారీగా బదిలీలు

### - 95 మంది డీఎస్పీలు ట్రాన్స్‌ఫర్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సంచలన నిర్ణయాలతో ముందుకెళ్తున్న రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా శాఖల్లో బదిలీల పర్వాన్ని చేపట్టింది. అందులోనూ ప్రధానంగా పోలీస్ శాఖలో భారీగా బదిలీలు చేపట్టింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం ఇటీవలే 13 మంది ఐపీఎస్‌లతో పాటు ఎక్సైజ్ శాఖలోని వివిధ స్థాయిల్లోని 105 మందిని బదిలీ చేసింది. 10 మంది అడిషనల్ ఎస్పీలతో పాటు ఏకంగా 95 మంది డీఎస్పీలను, ఏసీపీలను సర్కార్ బదిలీ చేసింది ప్రభుత్వం. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
కమాండ్ కంట్రోల్ సెంటర్ అడిషనల్ డీసీపీగా ఎన్ఎస్ మోహన్‌రాజా, రామగుండం అడిషనల్ డీసీపీ (ఆపరేషన్స్)గా వీ శ్యామ్‌బాబు, సౌత్ జోన్ అడిషనల్ డీసీపీగా టీ స్వామి, ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా ముత్యంరెడ్డి, జెన్‌కో అడిషనల్ ఎస్పీగా డీ ప్రతాప్, తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ అడిషనల్ ఎస్పీగా ఆర్ సుదర్శన్‌ను నియమించారు. అక్టోపస్ అడిషనల్ ఎస్పీగా కే గంగారెడ్డి,

6లో ▶

## రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ లేనట్లే

### వైసీపీ నేతల చేరికలపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



- రాజ్యసభ ఎన్నికల్లో పోటీపై చంద్రబాబు క్లారిటీ
- ఉండవల్లిలోని నివాసంలో పార్టీ ముఖ్యులతో భేటీ
- వైసీపీ నుంచి ముఖ్యనేతలు టచ్‌లో ఉన్నారన్న చంద్రబాబు

6లో ▶

## రేవంత్ రాజీనామా చేస్తే సీఎంగా ప్రమాణం చేస్తా

### - హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మేడిగడ్డకు రిపేర్లు చేయించడం చేతకాపోతే రాజీనామా చేయాలని తాను ప్రమాణ స్వీకారం చేసి రిపేర్లు చేయిస్తానని హరీష్ రావు సీఎం రేవంత్ కు సవాల్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ బురద రాజకీయాలకు పాల్పడుతున్నదని హరీష్ రావు మండిపడ్డారు. కాళేశ్వరం సమగ్ర స్వరూపం చాలా మందికి తెలియదు. కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌజులు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటి కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టిఎంసీల ఉపయోగం వీటన్నింటి సమాహారం కాళేశ్వరం. ఒక్క మేడిగడ్డనే

6లో ▶

# బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్ర

## - ఖరారు చేసిన పార్టీ అధినేత కేసీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజ్యసభ అభ్యర్థిని ఖరారు చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త వద్దిరాజు రవిచంద్రను రీ నామినేట్ చేసింది. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 9వ తేదీ నాటికి ఆయన పదవీ కాలం ముగియనుంది. రెండోసారి కూడా ఆయనకే అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం రాజ్యసభలో ఏడుమంది సభ్యుల బలం ఉంది బీఆర్ఎస్‌కు. బీ పార్థసారథి రెడ్డి, డీ దామోదర్ రెడ్డి, కే కేశవరావు, కేఆర్ సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బీ లింగయ్య యాదవ్, జోగినపల్లి సంతోష్ కుమార్ రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. వారిలో వద్దిరాజు రవిచంద్ర, లింగయ్య యాదవ్, సంతోష్ కుమార్ పదవీ కాలం ఏప్రిల్ నాటికి ముగియబోతోంది. శాసనసభలో బీఆర్ఎస్‌కు ఉన్న బలం ఆధారంగా ఈ దఫాలో ఒక్కరిని మాత్రమే నామినేట్ చేసే అవకాశం ఉంది. దీనితో వద్దిరాజును రీనామినేట్ అయ్యారు. గురువారం ఆయన తన నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తారు. మిగిలిన వారిలో పార్థసారథి రెడ్డి, దామోదర్ రెడ్డి పదవీ కాలం 2028లో ముగుస్తుంది. 2026 ఏప్రిల్ వరకూ కే కేశవరావు, కేఆర్ సురేష్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతారు. వద్దిరాజు రవిచంద్రకు గాయత్రి రవిగా గుర్తింపు ఉంది. గాయత్రి గ్రూప్ ఆఫ్ కంపెనీల వ్యవస్థాపకుడు ఆయనే. ప్రస్తుతం చీఫ్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తోన్నారు. తెలంగాణ గ్రానైట్ క్వారీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుగా ఉన్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వద్దిరాజు గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. 2018 ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. 2022లో మొదటి సారిగా రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇప్పుడు ఆయననే మళ్లీ రీ నామినేట్ చేశారు కేసీఆర్.

# సెక్రటేరియట్‌లో రాజీవ్ గాంధీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

## - కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఆగ్రహం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ లో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలని నిర్ణయించుకున్నారు. నిర్ణయం తీసుకుని వెంటనే శంకుస్థాపన కూడా చేసేశారు. ఒక పక్క అంబేద్కర్, మరోపక్క ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జైపాల్ రెడ్డి గారి విగ్రహాలు ట్యాంక్ బండ్ పరిసరాల్లో ఉన్నాయని ఇక్కడ రాజీవ్ గాంధీ గారి విగ్రహం లేని లోటు స్పష్టంగా కనిపించిందని రేవంత్ రెడ్డి శంకుస్థాపన సందర్భంగా అన్నారు. టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చిన మహా నేత రాజీవ్ గాంధీ దేశ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని గుర్తు చేసుకున్నారు. ఆయన విగ్రహం కేవలం జయంతి, వర్ధంతులకు దండలు వేసి దండాలు పెట్టడానికి కాదు.. మహానుభావుల విగ్రహాలు చూసినపుడు వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలన్న భావన మనకు కలగాలన్నారు. ఇది చరిత్రలో నిలిచిపోయే సందర్భమని గుర్తు చేసుకున్నారు. సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం ఉన్నన్ని రోజులు ఈ సందర్భం గుర్తుంటుందని.

అందరికీ ఆదర్శంగా ఉండే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. విగ్రహావిష్కరణకు సోనియాగాంధీ ని ఆహ్వానిస్తామని ప్రకటించారు. అయితే రేవంత్ నిర్ణయంపై బీఆర్ఎస్ మండిపడింది. సెక్రటేరియట్‌లో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయనకు తెలంగాణకు ఏం సంబంధం అన్నారు. అక్కడ కేసీఆర్ హయాంలో ప్రతిపాదించిన తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని కోరారు. మొత్తంగా రాజీవ్ గాంధీ విగ్రహం ముందు ముందు వివాదాలకు కారణమయ్యే అవకాశం కనిపిస్తోంది.



# తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఫిక్స్

## - లక్కీ ఛాన్స్ కొట్టేసిన యువ నేత

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులను అధిష్ఠానం ఎట్టకేలకు ప్రకటించింది. ముందు నుంచి జరుగుతున్న ప్రచారం మేరకు ఒక అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి పేరును కన్ఫామ్ చేసింది. అయితే మరో అభ్యర్థిగా ఎవరూ ఊహించని విధంగా ఓ యువ నేత పేరును ఫిక్స్ చేసింది కాంగ్రెస్ అధిష్ఠానం. సికింద్రాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ యాదవ్‌ల పేర్లను ఏఐసీసీ ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరికి అసెంబ్లీలో సీటు ఇవ్వకపోవటంతో ఎంపీగా ఛాన్స్ ఇవ్వనున్నారని అంతా భావించారు. ఈ మేరకు పార్టీలోనూ మొదటి నుంచి ప్రచారం జరుగుతోంది. అందుకు అనుగుణంగానే రేణుకా చౌదరిని రాజ్యసభ అభ్యర్థిగా అధిష్ఠానం ఫిక్స్ చేసింది. అయితే ఇప్పుడు యువ నేత, మాజీ ఎంపీ అంజన్ యాదవ్ కుమారుడు అనిల్ యాదవ్‌కు రాజ్యసభకు బెర్త్ కన్ఫామ్ కావడం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. నామినేషన్ దాఖలుకు మరికొన్ని గంటల సమయం మాత్రమే ఉన్న క్రమంలో అనూహ్యంగా అనిల్ కుమార్ యాదవ్ పేరు ఫైనల్ కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అనిల్ కుమార్ యాదవ్ ముషీరాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేశారు. కానీ ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ చేతిలో ఓడిపోయారు. అయితే ఇప్పుడు ఏకంగా పెద్దల సభకు వెళ్లే లక్కీ ఛాన్స్ కొట్టేశాడంటూ చర్చించుకుంటున్నారు.

తెలంగాణలో మొత్తం మూడు రాజ్య సభ స్థానాలు ఖాళీ కానున్నాయి. ప్రస్తుతం ఉన్న బలాబలాల ప్రకారం.. కాంగ్రెస్‌కు రెండు సీట్లు దక్కనుండగా ఒకటి ఏఐసీసీకి, మరోకటి పీసీసీకి ఇస్తారని మొదటి నుంచి ప్రచారం జరిగింది. ఈ మేరకు తెలంగాణ నుంచి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని రాజ్యసభకు పంపించాలని టీపీసీసీ భావించింది. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా వెళ్లి సోనియా గాంధీని రిక్వెస్ట్ కూడా చేశారు. అయితే చివరికి రెండు స్థానాలు పీసీసీకే దక్కటంతో ఈ విషయంలో రేవంత్ పాచిక పారలేదని చర్చ నడుస్తోంది.తెలంగాణలో 3 రాజ్య సభ స్థానాలు ఖాళీ కానున్నాయి. బీఆర్ఎస్ ఎంపీలు జోగినపల్లి సంతోష్, వద్దిరాజు రవిచంద్ర, బడుగుల లింగయ్య యాదవ్‌ల పదవి కాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ 3 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. నామినేషన్ల దాఖలుకు ఈనెల 15 చివరి తేదీ కాగా ఈ నెల 27వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి.





ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల బలాబలాల ప్రకారం రెండు స్థానాలు అధికార కాంగ్రెస్ పార్టీ దక్కనుండగా మరొకటి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి దక్కనుంది.

ప్రస్తుతం కాంగ్రెస్ ఇద్దరు అభ్యర్థులను ప్రకటించగా మరి బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరన్నది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠగా మారింది.

# సరస్వతి దేవి పుత్రునిగా, పుడమి తల్లి ఒడిలో నిద్రపోయే నీ రూపం మరవరానిది

## - మీ సేవలు మరువలేము బాల రాజా



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రం గ్రామ సర్పంచ్ గా మంచి సేవలందించారు. విద్యార్థి దశలోనే వినూత్నమైన కార్యచరణకు శ్రీకారం చుట్టి, బోధనలకు నేర్పరిగా విద్యార్థి దశ నుండే గురువు దిశగా ప్రయాణాన్ని కొనసాగించి. శూన్యమైన విద్యార్థి దశను ఉన్నతమైన శిఖరాలకు, అక్షరాలను నేర్పే గురువుగా వసంత పంచమి రోజున సరస్వతి దేవి పుత్రునిగా, పుడమి తల్లి ఒడిలో నిద్రపోయే నీ రూపం మరవరానిది. కనుల ముందే కనుమరుగైపోయిన నీ జీవం శోకసంద్రమయం. తనతో చదువుకున్న విద్యార్థి దశ నుండి కలిసిమెలిసి ఉన్న అందరి మన్నలను పొందే ఒక దేశ సేవకుడిగా అవతరించారు. ఇంత తొందరగా అస్తమిస్తారని అనుకోలేదని తన మిత్రబృందం కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఆయన సతీమణి ఆయన పోయాడని తట్టుకోలేకపోతూ వినిపిస్తున్న ఆమె గోసును చుట్టుపక్కల ఉన్నవారు. తట్టుకోలేకపోతున్నారు అంత ప్రేమ అందించిన మహా వ్యక్తి బుధవారం మనలో లేడని ఆ మిత్రబృందం రోధిస్తున్నారు. ధర్పల్లి లో సర్పంచ్ గా రెండోసారి గెలిచిన వ్యక్తి లేరు అంటే దానికి అర్థం ఇంత మంచి వ్యక్తి లేడని రెండోసారి ఎన్నిక చేసుకున్న గ్రామ ప్రజలు ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో మూడోసారి కూడా తనను గెలిపిస్తామని అనుకున్న వారి నుండి తప్పించుకొని పారిపోయాడని వారు అంటున్నారు. కొడుకు వేరే దేశం నుండి రావడం వలన ఒకరోజు ఆయన అంత్యక్రియలు ఆపడం జరిగింది నేడు తన స్వగృహం నుండి అంత్యక్రియలు జరుగును.

# శివాజీ జయంతి రోజు సెలవు దినం ప్రకటించాలి

## - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించిన సి డి చవాన్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించిన శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సి డి చవాన్. సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సి డి చవాన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఫిబ్రవరి 19న చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా సెలవు దినం ప్రకటించాలని కోరగా సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. డిసిసి అధ్యక్షుడు డాక్టర్ సి రోహిన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చత్రపతి శివాజీ జయంతి రోజు పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ప్రారంభించి ఊరేగింపుగా ఓయూ కళాశాల నుండి రామ్ నగర్ గుండు , ముషీరాబాద్ , కవాడిగూడ , ట్యాంక్ బండ్, సచివాలయం, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్పేట్, ఎర్రగడ్డ మీధులుగా సనత్ నగర్ లో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు . శివాజీ మహారాజ్ భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ

# బినామీలను విచారించిన ఏసీబీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ కేసులో ఏసీబీ అధికారులు తవ్వే కొద్ది అక్రమాలు బయటపడుతున్నాయి. వందల కోట్ల ఆస్తులు అక్రమంగా సంపాదించినట్లు ఏసీబీ గుర్తించింది. ఎనిమిది రోజుల కస్టడీలోకి తీసుకొని విచారించడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సత్యనారాయణ , భరత్ ఇద్దరూ శివ బాలకృష్ణకు బినామీలుగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో బినామీలను ఏసీబీ అధికారులు విచారించారు. వారి పేర్లతోనే విలువైన భూములు, స్థలాలు ఉన్నట్టు అనుమానిస్తున్నారు. గురువారం మరోసారి సత్యనారాయణ, భరత్ లను విచారించాలని నిర్ణయించారు. కస్టడీ సమయంలో శివ బాలకృష్ణ సరైన సమాధానాలు చెప్పకపోవడంతో.. మరింత లోతుగా బినామీలను ప్రశ్నించేందుకు ఏసీబీ రెడీ అయింది. ఈ కేసులో శివ బాలకృష్ణ అనుచరులు, బినామీలు, కుటుంబసభ్యులను ఏసీబీ అధికారులు విచారించనున్నారు.




### - అనుమతుల ద్వారా కోట్ల రూపాయలు వసూలు

ఎనిమిది రోజులు కస్టడీలో శివబాలకృష్ణ ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి పేరును అవినీతి నిరోధక శాఖ అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఆ అధికారి ఆదేశాల ప్రకారమే వివాదాస్పద భూములకు అనుమతులు జారీ చేసినట్లు తేలింది. అనుమతుల ద్వారా కోట్ల రూపాయలను శివ బాలకృష్ణ అక్రమంగా సంపాదించినట్లు ఏసీబీ గుర్తించింది.

పలు వివాదస్పద భూములకు అనుమతులు ఇప్పించినందుకు ఐఏఎస్కు భారీగా లబ్ధి చేకూరిందని శివబాలకృష్ణ వెల్లడించాడు. వాటిల్లో తనకూ వాటాలు ముట్టినట్లు అంగీకరించాడు. సదరు ఐఏఎస్ ఆదేశాల మేరకు అనుమతులిచ్చిన ప్రాజెక్టుల వివరాలను, ఆ సమయంలో తమకు అందిన డబ్బులతో కొనుగోలు చేసిన భూముల వివరాలు ఏసీబీకి చెప్పినట్లు తెలుస్తోంది.

### - ఐఏఎస్ పేరుతో భూముల రిజిస్ట్రేషన్

ఐఏఎస్ అధికారి ఎవరి పేరుతో స్థిరాస్తులను రిజిస్ట్రేషన్ చేయించారు ? ఆ భూములు ఎక్కడ ఉన్నాయి ? వాటి విలువ ఎంత ? అన్న వివరాలను శివబాలకృష్ణ కస్టడీలో బహిర్గతం చేసినట్లు తెలుస్తోంది. కొంత డబ్బును ఐఏఎస్ ఇంటికెళ్లి ఇచ్చినట్లు చెప్పడం ప్రాధాన్యం సంతరించుకొంది. సీనియర్ ఐఏఎస్ అధికారితో తరచూ వాట్సాప్లో మాట్లాడేవాడని ఏసీబీ విచారణలో తేలింది. అక్రమార్జనను ఆస్తులుగా మార్చుకునేందుకు బినామీలతోనూ సంభాషించినట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు. ఆయా డీల్స్ జరిగిన సమయంలో శివబాలకృష్ణకు ఐఏఎస్కు మధ్య జరిగిన ఫోన్ కాల్స్, వాట్సప్ సంభాషణలతోపాటు ఇద్దరి ఫోన్ లొకేషన్లకు సంబంధించి డేటాను సేకరించే పనిలో నిమగ్నమైంది ఏసీబీ.

### - శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసులో రంగంలోకి ఈడీ

శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. శివబాలకృష్ణ కేసు వివరాలు ఇవ్వాలని ఏసీబీని కోరింది. కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్, దర్యాప్తులో స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలను ఇవ్వాలని ఈడీ ఆదేశించింది. రూ.250 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను పోగు చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

ఇందులో బినామీల పేరిటే 214 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేలింది. అత్యధికంగా జనగామ జిల్లాలో 102 ఎకరాలు, యాదాద్రి జిల్లాలో 66, నాగర్‌కర్నూల్ జిల్లాలో 39, సిద్దిపేట జిల్లాలో 7 ఎకరాల వ్యవసాయ భూములను గుర్తించారు. శివబాలకృష్ణ పేరుతో మొత్తం 29 ఇళ్ల స్థలాలు ఉన్నాయి. విశాఖపట్నం, విజయనగరంలో కూడా స్థలాలు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది.

# సంపాదకీయం

## జమిలీ ఎన్నికలు సాధ్యమేనా

ఒకే దేశం - ఒకే ఎన్నిక' అంశం మళ్ళీ వార్తల్లోకి వచ్చింది. కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగాల్సి వుంది. ఈ లోపు నిర్ణయం వెలువడి ఎన్నికలు జమిలిగా జరగడం సాధ్యం కాని పని.దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు,లోక్ సభకు ఏక కాలంలో ఎన్నికలు జరపాలనే నినాదాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదే పదే వినిపిస్తూనే వున్నారు.మొదటి నుంచీ జమిలి ఎన్నికల నిర్వహణపై ఆయన పట్టుదలగానే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే, ఈ అంశంపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతిరామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో గత సంవత్సరం సెప్టెంబర్ లో కేంద్రం ఒక కమిటీని ఏర్పాటుచేసింది.సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే దిశగా కమిటీ పనిచేయడం కూడా ప్రారంభించింది. ప్రజల నుంచి సూచనలు, సలహాలను ఆహ్వానించింది. స్పందన కూడా విశేషంగా వచ్చింది. ఇప్పటివరకూ సుమారు 5వేలకు పైగా ఈ - మెయిల్స్ వచ్చినట్లు సమాచారం.ఇప్పటి వరకూ రెండు సార్లు సమావేశాలు జరిగాయి.కేంద్రం ఇటీవలే 6 జాతీయ పార్టీలు, 33 ప్రాంతీయ పార్టీల నుంచి అభిప్రాయాలు కోరింది. జమిలి ఎన్నికలకు సంబంధించి న్యాయ కమిషన్ నుంచి కూడా సలహాలు తీసుకుంది. మరి కొన్ని నెలల వ్యవధిలోనే సాధారణ ఎన్నికలు జరగాల్సిన నేపథ్యంలో,ప్రతిపక్ష పార్టీల వ్యాఖ్యల వేడి పెరుగుతోంది. ముఖ్యంగా తృణమూల్ పార్టీ అధినేత్రి,పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జమిలి ఎన్నికలకు ససేమిరా అంటున్నారు.అదే విషయాన్ని స్పష్టం చేస్తూ రామ్ నాథ్ కోవింద్ కమిటీకి ఉత్తరం కూడా రాశారు. ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వాన్ని అనుమతించే వ్యవస్థగా మారుతుందని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.జమిలి ఎన్నికలకు తాము దూరంగానే ఉంటామని స్పష్టం చేశారు. కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కారణాలతో తమ ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేయలేకపోవచ్చని గత చరిత్రను గుర్తుచేస్తున్నారు.అనేకసార్లు లోక్ సభ రద్దయిందని, భవిష్యత్తులో కూడా అటువంటి పరిస్థితులు తలెత్తుతాయనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఓటర్ల ఎన్నికల విశ్వాసాన్ని ఉల్లంఘించడం న్యాయమా? అని ఆమె ప్రశ్నిస్తున్నారు. తృణమూల్ పాటు మిగిలిన ప్రతిపక్ష పార్టీలకు అనేక భయాలు ఉన్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కు ఎన్నో అనుమానాలు ఉన్నాయి.'జమిలి' అంటే రాష్ట్రాలపై దాడి చేయడమేనని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శనా బాణాలు సంధిస్తున్నారు. ఈ ఎన్నికల వల్ల సామాన్యులకు ఒరిగేదేంటని కేజ్రీవాల్ ప్రశ్నిస్తున్నారు. 2024లో జమిలి ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమని లా కమిషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. 2029 నుంచి లోక్ సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేలా లా కమిషన్ ఓ ఫార్ములా రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.లా కమిషన్ ఇంకా తుది నివేదికను తయారుచేయాల్సివుంది. పంచాయతీల నుంచి పార్లమెంట్ దాకా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్నది బిజెపి ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ముఖ్యంగా,దీనివల్ల డబ్బు ఆదా అవుతుందని,ఆ ధనాన్ని అభివృద్ధి పనుల కోసం కేటాయించవచ్చని మోదీ సర్కార్ వాదిస్తోంది.ఈ చర్చ ఈనాటిది కాదు.2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన వెనువెంటనే అన్ని పార్టీలను ఆహ్వానించి దీనిపై చర్చ కూడా జరిపారు. దేశ వ్యాప్తంగా మొత్తం నలబై రాజకీయ పార్టీలను ఈ సమాలోచనకు ఆహ్వానించారు. 21పార్టీలు మాత్రమే హాజరయ్యాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీలు అప్పట్లో జమిలి ఎన్నికలకు జై కొట్టాయి.వచ్చిన మిగిలిన పార్టీలు విభిన్న స్వరాలను వినిపించాయి.కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగానే ఉంది. లోక్ సభకు,శాసనసభలకు సమాంతరంగా ఏకకాలంలో జరపడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి, ప్రధానంగా ఖర్చు కలిసివస్తుందన్నది వాస్తవమే.వివిధ ఎన్నికల కోడ్ పేరుతో జరగాల్సిన కార్యక్రమాలు జరగకుండా పనులు ఆగిపోవడం, సమయం వృథా అవ్వడం మొదలైన వాటికి అడ్డుగోడ పడుతుంది.తద్వారా పనిరోజులు పెరుగుతాయి.ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. కనీసం రెండు,మూడు రాష్ట్రాలలో ఎన్నికలు తప్పనిసరిగా వస్తుంటాయి.ఈ నేపథ్యంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోడానికి వెనుకాడే పరిస్థితి వస్తుంది.అన్ని చోట్ల సమాంతర ఎన్నికల విధానం అందుబాటులో ఉంటే,కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి మరింతగా పరిపాలనపై దృష్టి సారించే వెసులుబాటు ఉంటుంది. ఐదేళ్లకొకసారి అన్ని వ్యవస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల రాజకీయ సుస్థిరత నెలకొనే అవకాశం ఉంది.బిజెపి ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికలపై కొందరు అనేక అనుమానాలు, సందేహాలు,అభ్యంతరాలు వ్యక్తం చేశారు.ఈ ప్రతిపాదన వల్ల ఎటుచూసినా,కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికే ఎక్కువ మేలుజరుగుతుందనీ,అందుకే, దీనిపై బలంగా ప్రచారం చేస్తోందనే భావంలో ప్రతిపక్షాలు ఉన్నాయి. కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీకి సంపూర్ణమైన బలం లేకపోతే, వివిధ ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం నడపాల్సిన పరిస్థితి వస్తుందనీ, దీని వల్ల కేంద్రంలో పాలనకు అవరోధాలు ఏర్పడతాయనే అనుమానాలు బిజెపికి ఉన్నాయి.జమిలి ఎన్నికలు జరిగితే, ఐదేళ్లపాటు యథేచ్ఛగా తమ విధానాలను అమలుపరిచే స్వేచ్ఛ మరింత బలంగా ఉంటుందనే అభిప్రాయంలోనే బిజెపి మొదటి నుంచి వుంది.కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సహజంగా ఆధిక్యత వస్తుందనీ,దాని వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందనే భయంలో కొన్ని ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. దేశ సమగ్రతకు జమిలి ఎన్నికల వల్ల భంగం కలిగే ప్రమాదం ఉందనీ కొందరు విమర్శిస్తున్నారు.పరోక్షంగా అధ్యక్ష వ్యవస్థకు నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలు దీని వెనకాల దాగి ఉన్నాయనే భయాలు కొందరిలో లేకపోలేదు.ఈ భయాలన్నీ ప్రధాన జాతీయ పార్టీ కాంగ్రెస్ కు, ఆ పార్టీని అనుసరిస్తున్న కొన్ని పార్టీలకు ఉన్నాయి. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే, కొన్ని శాసనసభల పదవీకాలాన్ని కుదించాలి,కొన్నింటిని పొడిగించాలి.ఇటువంటి కీలకమైన చర్యలకు రాజ్యాంగ సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనికి సరిపడా బలం ఉభయ సభల్లోనూ బిజెపికి ఉంది. 'సమాంతర ఎన్నికల'పై,2018 ఆగస్టులో లా కమిషన్ ఒక ముసాయిదా నివేదిక సమర్పించింది. చట్ట సవరణ జరిగిన తర్వాత, దేశంలోని సగం రాష్ట్రాల శాసనసభలు ఆమోదం తెలపాల్సిన అవసరం కూడా ఉంది.ఇక్కడకూడా బిజెపికి వాతావరణం అనుకూలంగానే ఉంది.లోక్ సభ, శాసనసభలకు ఎన్నికలు జరిగినప్పుడు కొన్నిచోట్ల క్రాస్ ఓటింగ్ జరుగుతూ ఉంటుంది. శాసనసభకు స్థానిక పార్టీకి వేసి, లోక్ సభకు జాతీయ పార్టీకి వేసే మైండ్ సెట్ కొందరు ఓటర్లలో ఉంటుంది.ఫలితాలు తదనుగుణంగా వచ్చిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఎల్లవేళలా,అధికారంలో ఉండే పార్టీలకు సంపూర్ణమైన మెజారిటీ ఉండకపోవచ్చు.ప్రభుత్వాలు నడిపే క్రమంలో, విభేదాల వల్ల ప్రభుత్వం పడిపోయినప్పుడు,ఎన్నికలు మళ్ళీ నిర్వహించాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాల్లో ఏమి చేయాలి? అనే సందేహాలు ఉన్నాయి.ఇలా జమిలి ఎన్నికల అంశంలో అనేక అనుకూల, ప్రతికూల అంశాలు,సందేహాలు, అనుమానాలు ఉన్నాయి. వీటన్నింటిపై దేశ వ్యాప్తంగా సమగ్రమైన చర్చ జరగాలి. ప్రజామోదాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి.చర్చలో అన్ని పార్టీలు పాల్గొనాలి.మంచిచెడు, లాభనష్టాలు బేరీజువేసుకోవాలి. "కేవలం ఇది చర్చించే విషయం కాదని,భారత్ కు ఎంతో అవసరం", అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేకమార్లు ఉద్ఘాటించారు. పార్టీల రాజకీయ స్వార్థాలు ఎట్లా ఉన్నా,దేశ ప్రజల మంచికి,దేశ ప్రగతికి పట్టంకట్టే విధానాలను స్వాగతించవచ్చు.

# శ్రీశైలం క్షేత్రంని దొంగ స్వాముల బారినుండి కాపాడండి

**- భక్తులరా మోసపోకండి**

**- పూజలు హోమాల పేరుతో నిలువు దోపిడీ**

**- హోమాలు అన్నదానాలు దేవస్థానమే చేస్తుంది**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) ప్రజలలో కొన్ని వీక్నెస్ లో కొంతమందికి పెట్టుబడిగా మారుతుంటాయి. ఇటీవల హోమాలు, పూజలు, న్యూమరాలజీ, జాతకాలు వాస్తు అంటూ ఎవరి స్టైల్ లో వాళ్ళు దోచుకోవడం మొదలుపెట్టేశారు. కొంతమంది దొంగ బాబాలుజాతకం, పూజలు, హోమాల నెపంతోయావత్ తెలుగు ప్రజలను నిత్యం మోసం చేస్తూ ధనం సంపాదనే ధ్యేయంగా శ్రీశైలం లో కొన్ని ఆశ్రమాల నిర్వహణ జరుగుతోంది. భక్తుల, హిందువుల మనోభావాలును వాడుకొని



లక్షల్లో వ్యాపారం వశీకరణం, తంత్రం, క్షుద్రం చేస్తామని రక రకాలుగా ప్రచారం చేసుకుంటూ ధనార్జనే లక్ష్యం గా కొన్ని ఆశ్రమం లో నిత్యం శ్రీశైలం వచ్చే భక్తులును మోసం చేసుకుంటూ భక్తి అనే మార్గం ను వ్యాపారం చేస్తూ వారి జేబులు నింపుకుంటూ దేవస్థానంకి వచ్చే ఆదాయం కి భారీగా గండి కొడుతున్నారు. శ్రీశైలం దేవస్థానం పేరు చెప్పుకొని లక్షలలో వ్యాపారం చేస్తున్నారు. విగ్రహాలు ప్రతిష్ట చేసుకుంటూ అమాయక భక్తులను మోసపు మాటలతో దేవస్థానం అభివృద్ధి కి ఎంతో నష్టం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ ఇలా సోషల్ మీడియా ఆధారంగా తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ ప్రసార మాధ్యమాల్లోనే కాకుండా అనేక విధాలుగా పరోక్షముగా కూడా పూజలు చేస్తామని శ్రీశైలం పేరు చెప్పుకొని ధన సంపాదనే ధ్యేయంగా క్షేత్రం పేరును అప్రతిష్ట పాలు చేస్తున్నారు.

ఈ విషయం లో శ్రీశైలం దేవస్థానం ఈవో స్పందించి ఇలాంటి ఆశ్రమాలపై వెంటనే విచారణ జరిపించి దేవస్థాన నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న ఆశ్రమాలపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.గతం లో కూడా ఇలాగే కొంత మంది వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా శ్రీశైలం లో వ్యాపారం చేస్తుంటే వారిని క్షేత్రం నుండి బహిష్కరిస్తూ సంబంధిత వ్యక్తులు ఉండే రూమ్ కి తాళాలు వేయటం జరిగిందని గురువుల ముసుగులో వ్యాపారం చేస్తున్న వ్యక్తులు గుర్తించి దేవాలయ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆహార భద్రత... అందరి వ్యవహారం



తిండి కలిగితే కండ కలదోయ్ అని మహాకవి గురుజాడ అప్పారావు చాలా తేలికగా చెప్పేశారు గానీ.. ఈ కాలంలో తిండి ఒక్కదానితోనే కండలు వచ్చేయవు. ఆ కండలతో కలిసి ఆరోగ్యమూ సమకూరాలంటే.. ఏం తింటున్నాం? ఎలా తింటున్నాం? ఎప్పుడు.. ఎక్కడ తింటున్నామన్నదీ ముఖ్యం. అవగాహన లోపం కొంత.. కాలుష్యం మరికొంత కలిసి.. ఆహారం కారణంగా కొన్ని అనారోగ్య సమస్యలను తెలియకుండానే చవిచూస్తున్నాం.

**ఆహార భద్రత... అందరి వ్యవహారం** : ఆహార భద్రత దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2019లో మొదలుపెట్టింది. తినే తిండి వల్ల కలిగే నష్టాలపై, రాగల ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, తద్వారా మానవ ఆరోగ్యానికి, ఆహార భద్రతకు, ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయానికి, పర్యాటకానికి సాయపడటం లక్ష్యం. గతేడాది అడిస్ అబాబా, జెనీవాలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో 'ఆహార భద్రత-భవిష్యత్తు' అనే అంశంపై చర్చలు జరిగాయి. మేలైన ఆహారం తగినంత అందరికీ లభించడం వెనుక సామాజిక ఆర్థిక కారణాలు ఉండవచ్చుగానీ, దీని ప్రభావం మాత్రం అందరిపై ఉంటుందని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేస్తోంది. అందుకే ఈ ఏడాది 'ఆహార భద్రత.. అందరి వ్యవహారం' అనే ఇతివృత్తంతో కార్యక్రమాలను రూపొందించింది. మనం తినే ఆహారం సురక్షితంగా ఉండేందుకు, మన ఆరోగ్యాన్ని పాడుచేయకుండా ఉండేందుకు పొలంలోని రైతు మొదలుకొని, విధానాలు రూపొందించే ప్రభుత్వాధినేతల వరకూ ప్రతి ఒక్కరు తమదైన పాత్ర పోషించాలని డబ్ల్యూహెచ్ఓ చెబుతోంది. ఫలితంగా కలుషిత ఆహారం తినడం వల్ల వచ్చే వ్యాధుల భారం తగ్గి సమాజం అభివృద్ధి చెందుతుందని అంచనా.

**వీటితో ఆరోగ్యానికి చేటు** : ఆహారం కలుషితమయ్యేందుకు, తద్వారా అనారోగ్యం కలిగేందుకు బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు కారణం. అధిక మోతాదులో వాడే రసాయనిక ఎరు వులు, నిల్వ చేసేందుకు, రుచి కల్పించేందుకు ఉప యోగించే రసాయనాలు కూడా చేటు చేసేవే. సాల్మ నెల్లా, కాంపీలోబ్యాక్టర్, ఈ -కోలీ వంటి బ్యాక్టీరియా ఏటా కొన్ని కోట్ల మందిని అస్వస్థులుగా చేస్తోంది. ఈ బ్యాక్టీరియా కారణంగా తలనొప్పి, వాంతులు, తల తిరగడం, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. గుడ్లు, కోళ్లు, జంతు సంబంధిత ఆహారం ద్వారా సాల్మనెల్లా బ్యాక్టీరియా వ్యాపిస్తుంది. కాంపీలోబ్యాక్టర్, ఈ-కోలి పచ్చిపాలు, సక్రమంగా వండని కోళ్ల ఉత్ప త్తులు, నీటి ద్వారా వ్యాపిస్తాయి. పూర్తిగా ఉడికించని సముద్రపు ఉత్పత్తుల ఆహారం ద్వారా హెపటైటిస్- ఏ వైరస్ వేగంగా వ్యాపించడమే కాకుండా.. కాలేయ వ్యాధికి కారణమవుతుంది. కొన్ని రకాల పరాన్నజీవులు చేపల ద్వారా, మరికొన్ని ఇతర ఆహార పదార్థాల ద్వారా వ్యాపిస్తాయి. ఆహార పదార్థాలను ఎక్కువ కాలం నిల్వ చేయడం వల్ల లేదా తేమ ఎక్కువ ఉన్న చోటనిల్వ చేయడం వల్ల వచ్చే బూజు (అఫ్లాటాక్సిన్)తోపాటు అనేక ఇతర సహజసిద్ధమైన రసాయనాలు కూడా మన ఆహారాన్ని కలుషితం చేస్తాయి. ఈ విషపదార్థాలు దీర్ఘకాలం శరీరంలోకి పోతే రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతింటుంది. శరీరంలో పోగుపడే వాతావరణంలోని కాలుష్యాలు పాలీక్లోరినేటెడ్ బైఫినైల్స్, డయాక్సిన్స్‌లు జంతువుల ద్వారా మన శరీరాల్లోకి చేరుతున్నట్లు తెలుస్తోంది. ఇవి పునరుత్పత్తి వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సీసం, కాడ్మియం, పాదరసం వంటి విషతుల్యమైన రసాయనాలు కూడా ఆహారం ద్వారా శరీరంలోకి ప్రవేశించి మూత్రపిండాలు దెబ్బతినేందుకు కారణమవుతున్నాయి.

**ఇలా చేస్తే ఆరోగ్యానికి మేలు** మీ ఇంట్లో ఫ్రిడ్జ్ ఉందా? మీ ఆహారం మీకు సమస్యలు సృష్టించకుండా ఉండేందుకు దీన్ని తగిన రీతిలో వాడుకోవడం చాలా అవసరమని చెబుతోంది జాతీయ పోషకాహార సంస్థ. ఇంకా ఏం సూచిస్తోందంటే.. వండిన, వండని ఆహార పదార్థాలను రిఫ్రిజిరేటర్‌లో వేర్వేరుగా ఉంచాలి. ఆకుకూరలను నిల్వచేసే ముం దే.. వాటి వేళ్లను తొలగించి శుభ్రంగా కడిగి ఉంచడం మేలు. కోడిగుడ్లను మూత ఉన్న కాగితపు అట్ట డబ్బాలో ఉంచి నిల్వ చేయాలి. వండిన ఆహార పదార్థాలను నాలుగు రోజుల కంటే ఎక్కువ ఉంచరాదు. మూతతో కూడిన చిన్నచిన్న పాత్రల్లోనే వండిన ఆహారాన్ని ఉంచాలి. వండిన ఆహార పదార్థాలను కూడా గది ఉష్ణోగ్రతలో ఆరు గంటల కంటే ఎక్కువ సమయం ఉంచకూడదు. ఫ్రిడ్జ్‌లో నిల్వచేసిన పదార్థాలను తినే ముందు వేడి చేసుకోవడం అవసరం. ఆహారం వండే క్రమంలో ఇతర కాలుష్యాలేవీ అందులోకి చేరకుండా చూడాలి. అన్నింటికంటే ముఖ్యం.. ఆహా రం వండే ముం దు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. నిల్వ ఉన్న నీటితో కాకుండా.. నల్లా కింద చేతులు పెట్టి సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. కాయగూరలు, పండ్లను తినేముందు కూడా శుభ్రంగా నీటితో కడుక్కోవాలి. ఆహారం వండేటప్పుడు వీలైనంత మేరకు శుభ్రమైన నీటినే వాడాలి. ా సురక్షితమైన మంచినీటి వ్యవస్థ లేనప్పుడు ఆ నీటిని మరిగించి వాడొచ్చు. వంటపాత్రలోకి నీరు పోసేందుకు విడిగా గ్లాసుల్లాంటివి వాడటం మేలు. ఇల్లు, వంటగది శుభ్రంగా

# రోజూ చేసే పనులే వెన్నునొప్పికి కారణాలు..

**- ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త!**

మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన, సున్నితమైన భాగంగా వెన్నెముకును చెప్పొచ్చు. వెన్నెముకకు చిన్నపాటి గాయమైనా ప్రాణం విలవిల్లాడుతుంది. అలాగే రోజువారీ పనులపైనా ఈ ప్రభావం కనిపిస్తుంది. అయితే, వెన్నెముక సమస్యలను వెంటనే గుర్తించడం కష్టమే. ప్రాబ్లమ్ వచ్చిన తర్వాత తగ్గించడం అంత సులువు కాదు. అందుకే, మొదటి నుంచి జాగ్రత్తగా వ్యవహరిస్తే వెన్నెముక సమస్యలు రాకుండా కాపాడుకునే అవకాశం ఉంది. మనం ప్రతి రోజూ చేసే పనులే మన వెన్నెముకపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందనే విషయం చాలా మందికి తెలియదు. ఆ పనులే మెల్లిమెల్లిగా వెన్నును కుంగదీస్తాయి. బరువులు ఎత్తుడంతోపాటు వ్యాయామాలు చేయడమూ వెన్నుముకపై భారాన్ని పెంచుతాయి. ఈ నేపథ్యంలో రోజువారీ పనుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండటం తప్పనిసరి.

**ఎక్కువగా ఫోన్ వాడుతున్నారా?** : మొబైల్ ఫోన్ వినియోగం వెన్నెముకపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఎక్కువ సేపు తలను ఒకవైపే ఆన్చడం, మెడను పక్కకు వాల్చి ఫోన్ మాట్లాడటం, అతిగా గేమ్స్ ఆడటం వంటివి వెన్నుకు భారంగా మారతాయి. అందుకే ఫోన్ వాడకాన్ని తగ్గించండి. ముఖ్యంగా పిల్లలను ఫోన్‌కు దూరంగా ఉంచండి. మొబైల్‌తో ఎక్కువ సేపు గడిపితే భవిష్యత్తులో మెడ, వెన్నెముక సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని గుర్తుంచుకోవాలి.

**హై హీల్స్ వేసుకుంటున్నారా?:** మహిళలు ఎక్కువగా హైహీల్స్ ధరించి నడవడానికి ఇష్టపడతారు. కానీ హైహీల్స్ వేసుకోవడం మంచిది కాదు. చాలా ప్రమాదకరం కూడా.. ఎక్కువ సేపు హైహీల్స్‌పై నడిచేవారికి వెన్ను అమరిక అదుపు తప్పుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల భవిష్యత్తులో వెన్ను సమస్యలు తలెత్తుతాయి. హైహీల్స్‌కు బదులు ఫ్లాట్ చెప్పులు ధరించడమే మంచిది. మామూలు ఎత్తు ఉండే చెప్పులు వేసుకున్నా పెద్దగా ఇబ్బందులు ఉండవు.

**అధిక బరువులు ఎత్తొచ్చా?:** రోజూవారీ కార్యక్రమాల్లో భాగంగా ఒక్కోసారి అధిక బరువులు ఎత్తాల్సి ఉంటుంది. ముఖ్యంగా సంచులు, సూట్‌కేసులు మోస్తున్నప్పుడు ఒక చేత్తో పక్కకి వాలిపోవడం సహజమే. దీని వల్ల వెన్నెముక సమస్యకు దారితీయొచ్చు. వ్యాయమాలు చేసేప్పుడు కూడా ఇష్టానుసారంగా బరువులు ఎత్తొద్దు. ట్రైనర్ సూచనల మేరకే బరువులు ఎత్తాలి. పిల్లల స్కూల్ బ్యాగ్గులు సైతం ఎక్కువ బరువు ఉండకుండా చూసుకోవాలి. పిల్లల శరీర బరువులో 20 శాతం కంటే ఎక్కువ బరువు మోయకూడదు.

**ఎలా నిద్రపోతున్నారు?:**

నిద్రలో పడుకొనే భంగిక సక్రమంగా ఉంటే వెన్నెముకకు సౌకర్యంగా ఉంటుంది. లేకపోతే వెన్నెముక అదుపుతప్పుతుంది. పడుకొనే భంగిమ సక్రమంగా లేకపోతే వెన్నెముకపై అదనపు ఒత్తిడి పెరిగి మెడ నొప్పి వస్తుంది. తలగడ ఎత్తు కూడా దీనిపై ఆధారపడి ఉంటుంది. ఎత్తైన తలగడ కాకుండా తక్కువ ఎత్తుతో ఉండే దిండులను వాడటం మంచిది. వీలైతే మోకాళ్ల కింద ఒక తలగడ పెట్టుకుంటే శరీరానికి హాయిగా ఉంటుంది. ఇంటి పనులు చేసేటప్పుడూ చాలా జాగ్రత్తగా ఉండాలి. వెన్నుపై భారం పడకుండా పనులు చేయడాన్ని అలవర్చుకోవాలి.

**ఎక్కువగా కూర్చుంటున్నారా?:** కార్యాలయాల్లో ఎక్కువ సేపు కుర్చీలకు అతుక్కుని ఉండేవారికి కూడా వెన్నెముక సమస్య తప్పదు. తప్పుడు భంగిమలో కూర్చుంటే వెన్నుముక అదుపు తప్పుతుంది. తుంటిపై ఎక్కువ భారం పడుతుంది. ఈ సమస్య రాకూడదంటే.. ప్రతి అరగంటకు ఒకసారి తల, మెడను కిందికి, పైకి, కుడి-ఎడమలకు తిప్పుతూ ఉండాలి. ఎక్కువసేపు కూర్చునేవారికి వారికి.. మెడ, వెనుక కండరాలు, వెన్నెముకపై ఒత్తిడి పెరుగుతుంది. వెన్నుభాగం కుర్చీకి నిటారుగా ఉండాలి. పాదాలు నేలను తాకాలి. ప్రతి అరగంటకు ఒకసారి లేచి అటూ ఇటూ తిరుగుతూ ఉంటే చాలా మంచిది.

**పోషకాహారం తీసుకోండి:**

ఆహారపు అలవాట్లు బాగుంటే ఆరోగ్యం కూడా బాగుంటుంది. అందుకే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. కాల్షియం, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకుంటే చాలా మంచిది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, అవకాడో వంటివి వెన్నుకు చాలా మేలు చేస్తాయి. ఈ లక్షణాలతో బాధపడుతున్నారా?: నడిచేప్పుడు ఇబ్బందిగా ఉండటం, మూత్ర విసర్జన సమస్యలు, కాళ్లు, భుజాలు కదిపేందుకు ఇబ్బంది పడటం, తిమ్మిర్లు రావడం, స్పృహ కోల్పోవడం, తలనొప్పితోపాటు తీవ్రమైన మెడ నొప్పి లాంటితో బాధపడుతున్నారా? అయితే వెంటనే సంబంధింత డాక్టర్లను కలవాలి.

విశ్లేషణలు రచయిత వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే వాటితో పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు: ఎడిటర్

# శ్రీశైలం మహాక్షేత్రం లో అమ్మాలకన్నా అంభ కుంభోత్సవం

**16 నుండి 21 వరకు స్వామిఅమ్మవార్ల వైభవం మహాకుంభాభిషేక మహొత్సవానికి పలువురు ప్రముఖులకు ఆహ్వానం**









**శ్రీశైలం(ప్రశ్న న్యూస్ )**ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మహాకుంభాభిషేక మహొత్సవం నిర్వహించబడుతోంది. ఈ కుంభాభిషేక మహొత్సవానికి పలువురు ప్రముఖులను ఆహ్వానించడం జరుగుతోంది.ఇందులో భాగంగా విజయవాడలో ఉపముఖ్యమంత్రి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్య నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని మహాకుంభాభిషేక మహొత్సవానికి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమములో విశాఖ శారదాపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి నీ ,ఆలయ ఈఓ డి పెద్ది రాజు ,సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎన్.వి. మోహన్, అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉపమఉఖ్యమంత్రి వేద ఆశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేయడం జరిగింది.

# రాచకొండ కొత్వాల్ గా బాధ్యతలు చేపట్టిన తరుణ్ జోష్

**- కమిషనర్ పరిధిలో మత్తు పదార్థాల మీద ఉక్కుపాదం మోపుతాం**

**- శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు - మహిళా సంరక్షణ,సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాచకొండ కమిషనరేట్ నూతన కమిషనర్ గా నియమితులైన తరుణ్ జోషి ఐపీఎస్ నిన్న బుధవారం నేరేడు మెట్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది పేరడ్ చేసి స్వాగతం పలికారు, అలాగే అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాచకొండలో పని చేస్తున్న డీసీపీ, ఏసీపీ, ఇన్స్పెక్టర్ లు, ఎస్సై అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాచకొండ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలుతీసుకుంటామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు వాహనాలు అతి వేగంగా వల్లే జరుగుతాయని అతివేగంగా నడిపే వాళ్ళ పై ట్రాఫిక్ యాక్ట్ ప్రకారంరాష్ అండ్ నెగ్లన్సీ సెక్షన్ 75తోచర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే రోడ్డుకుఇరువైపులా ఉండే ఫుట్పాత్ లను ఆక్రమించి పాదచారులకు ఇబ్బందులు సృష్టించదన్నారు. తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. త్వరితగతిన నేరనిరూపణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సివిల్, ఏఆర్, బెటాలియన్, ట్రాఫిక్ వంటి అన్ని విభాగాలను సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు.గంజాయి, డ్రగ్స్ సరఫరా వినియోగం మీద ఉక్కుపాదం మోపుతామని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న కళాశాలల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలు వల్ల తలెత్తే సమస్యలు పై అవగాహన తరగతులు నిర్వహిస్తాం మన్నారు సిపి. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని కూడా తెలిపారు. గతంలో రాచకొండ అదనపు కమిషనర్ గా పని చేసిన అనుభవంతో రాచకొండ పరిధిలోని అన్ని ప్రాంతాల మీద సంపూర్ణ అవగాహన ఉందని, మూడు కమిషనరేట్లతో సమన్వయంతో కలిసి పనిచేస్తామని, ప్రజలకు ఎల్లవేళలా సేవలందిస్తామని, ప్రజా సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నేరాలను అరికట్టడంలో అందరితో కలిసికట్టుగా పనిచేస్తామని, పోలీస్ సిబ్బంది సంక్షేమం పై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రత్యేకంగా పేర్కొన్నారు. ప్రజలు నేర భయం లేకుండా ఉండాలంటే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నేరాలను అదుపు చేయాలని పిలుపునిచ్చారు.సంబంధితపోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు ఆటంకం కల్గించేవారు ఉంటే,ప్రజలు సమాచారం అందజేస్తేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో డీసీపీ యాదాద్రి రాజేష్ చంద్ర ఐపీఎస్, డీసీపీ మల్కాజిగిరి పద్మజ ఐపీఎస్, డీసీపీ ఎల్ బి నగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డీసీపీ ఎస్బి కరుణాకర్, డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ ఎస్ఓటీ మురళీధర్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డు సమావేశం

# "సివిల్ మెంబర్ టూ సిఈఓ"



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో బుధవారం జరిగిన పాలకమండలి సమావేశంలోని పలు అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది.బోర్డు పరిధిలో అనుమతులు లేకుండా, ఒకవేళ పెర్మిషన్ ఉంటే ఉన్నదాన్ని కన్న ఎక్కువ ఎఫ్ ఎస్ ఐ నిర్మాణాలు జరుగుతున్నాయి.ఇలా అక్రమ నిర్మాణాలను గుర్తించిన ఇంజనీర్ అధికారులు సంబంధింత యాజిమాన్యానికి కంటోన్మెంట్ యాక్ట్ 2006 ప్రకారం అక్రమనిర్మాణదారులకు మొదటిసారి 248 జారీ చేస్తారు.నెల రోజుల్లో స్పందించకపోతే ,వారం తరువాత 320 నోటీసులు జారీ చేస్తారు.సెక్షన్ 320 అంటే అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేయడం.ఇదే విషయం పై నిన్న బోర్డు సమావేశంలో సివిల్ మెంబర్ రామకృష్ణ వర్సెస్ సిఈఓ మధుకర్ నాయక్ మధ్య ఇదే విషయము పై మాటల యుద్ధం కొనసాగింది. గతంలో కూడా నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ పలు సందర్భంలో ఇలా ప్రతిపాదనలను ఆమోదించే విషయంలో ఎప్పటికప్పుడు అడ్డుపడుతు వ్యతిరేకిస్తున్నారని రిజిస్టర్ లో పేర్కొంటే మీపై అనర్హతవేటుపడే అవకాశాలున్నాయని బోర్డు సెక్రటరీ సీఈవో, రామకృష్ణనను హెచ్చరించడం గమనార్హం. అక్రమ నిర్మాణాలను ఆపాలని 248 నోటీసు జారీ చేసిన 30రోజుల అనంతరంకూడా నిర్మాణాలను కొనసాగిస్తే వాటిని కూల్చివేసేందుకు 320నోటీసును జారీ చేస్తున్నామని సీఈవో తెలిపారు. రెండు నోటీసులను జారీ చేయడానికి పాలకమండలి అనుమతులు తీసుకుంటున్నామని అన్నారు. 248నోటీసును జారీ చేసిన అనంతరం 30రోజుల్లోపు పాలకమండలి సమావేశం జరగకపోతే నిర్మాణదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకొని పూణె ఉన్నతాధికారుల వద్దకు అప్పీలుకు వెళు న్నారని, అప్పీలును రద్దు చేసేంతవరకు 320 నోటీసు జారీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.బొల్లారం హాస్పిటల్ పై సిఎం రేవంత్ ప్రత్యేక చొరవ: బోర్డు పరిధిలో ఉన్న బొల్లారంలోని వంద పడకల హాస్పిటల్ కి గతంలో మల్కాజిగిరి యంపీ గా సిఎం రేవంత్ రెడ్డి ఉన్నప్పుడు "కరోనా సమయంలో ఎంపీ నిధులు విడుదలతో సహాయపడ్డారు.హాస్పిటల్లో సర్జికల్ హైటమ్స్,రోగులకు ఔషధాలు విషయం పై కూడా తెలంగాణ సర్కారు సహాయం కోరుతున్నారు. అలాగే సిఎం ఓఎస్డీ గా అజిత్ రెడ్డి ఉండడం కంటోన్మెంట్ భౌగోళికంగాను , బోర్డు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా ఆయనకు తెలుసున్నారు.ఈ నేపథ్యంలో మొన్న తెలంగాణ ప్రభుత్వం సెక్రటరీని కలిసి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన "టిపిటి బకాయిలు యాభై కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరినట్లుసిఇఓ మధుకర్ నాయక్ వెల్లడించారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకి సిఎం రేవంత్ రెడ్డికి అవినాభావ సంబంధం ఉంది అని ఆయన అన్నారు.ఈ సమావేశంలో పాలకమండలి అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమ శంకర్ సీఈవో మధుకర్ నాయక్, సివిల్ మెంబర్ రామకృష్ణ, జాయింట్ సీఈవో ఆకాశ్ కుమార్ శర్మ, మాజీ డిప్యూటీ సీఈఓ బాలా నాయర్, బోర్డు వాటర్,ఎలక్ట్రికల్సూపరింటెండెంట్ రాజకుమార్,ఇంజనీర్లు ఉమాశంకర్, దినేష్, కృష్ణ సాగర్, టాక్స్ విభాగం సూపరింటెండెంట్ వెంకటరమణ,జూనియర్ అసిస్టెంట్ ఉమానంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘట్ కేసర్ 'లో కారు పల్టీలు నలుగురికి గాయాలు

**- మూడు పల్టీలు కొట్టిన హొండా కారు**

**- వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టిన బ్రెజ్జా కారు**

**- నిందతుడిపై పోలీస్ కేసు నమోదు**



ఘట్ కేసర్ ( ప్రశ్న న్యూస్ )మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఘట్ కేసర్ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం మధ్యాహ్నం విజయ్ తిలక్ అనే వ్యక్తి తన కుటుంబంతో సహా కలిసి హొండా కారులో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం వెళ్లారు. దర్శనం పూర్తి అయ్యాక తమ నివాసం హైదరాబాద్ అమీన్ పూర్ కు బయలుదేరారు.

**డేంజరస్ డ్రైవింగ్ .....**

దర్శనం తర్వాత ప్రశాంతంగా వెళ్తున్న హొండా కారు ఒక్కసారిగా భారీ కుదుపులకు గురైంది. ఏం జరిగిందో తెలుసుకునే లోగా కారు ఏకంగా మూడు సార్లు పల్టీ కొట్టింది. కారు ఉల్టా ఉండగానే ప్రాణాపాయ స్థితిలో ఉన్న నలుగురు వ్యక్తులను స్థానికులు కారులో నుంచి బయటకు లాగారు. దీంతో క్షతగాత్రులు గాయాలతో తమ ప్రాణాలను దక్కించుకున్నారు.



**120 కిమీ వేగంతో డ్రైవింగ్.....**

ఒకవైపు 40 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న విజయ్ తిలక్ హొండా కారును , వెనుక నుంచి అతి వేగంగా దాదాపుగా 120 కిలోమీటర్ల వేగంతో వచ్చిన ఎరుపు రంగు మారుతి సుజుకి బ్రేజ్జ కారు డికొట్టింది. దీంతో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో బాధితుడు విజయ్ తిలక్ హొండా కారు పూర్తిగా పాడైంది. కారు మరమ్మత్తులకు కూడా పనికిరాకుండా డొక్కు డొక్కు అయ్యింది. దీనిపై ఘట్ కేసర్ పోలీస్ స్టేషన్ లో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**ఇప్పటికీ దొరకని నిందితుడు .....**

కాగా ఇప్పటి వరకు పోలీసులు నిందితుడిని పట్టుకోలేకపోయారని స్థానికులు, బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సదరు కారు నడిపిన వ్యక్తిని పీఎస్ కు పిలిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గట్టిగా కోరుతున్నారు.

**త్రుటిలో నిలిచిన ప్రాణాలు.....**

కొద్దిలో ప్రాణాలు నిలిచాయని, ఒకవేళ ఏదైనా జరగరానిది జరిగి ప్రాణ నష్టం జరిగితే బాధ్యత ఎవరిదని బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. స్టేషన్ హౌజ్ ఆఫీసర్ , ఎస్ఐ శ్రీకాంత్ నిందితుడిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# వసంత పంచమి వేడుకలు




కుత్బుల్లాపూర్ (ప్రశ్న న్యూస్) వసంత పంచమి సందర్భంగా కుత్బుల్లాపూర్ లోని శ్రీ సాయి రామ్ హై స్కూల్ యాజమాన్యం నిర్వహించినటువంటి వసంత పంచమి వేడుకలు స్కూల్లో ఘనంగా జరిపారు. విశేష వేషధారణలతో సరస్వతీ మాత అవతారంలో పిల్లను చక్కగా తయారుచేసి వివిధ దేవతల రూపకల్పనతో వసంత పంచమిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నల్లపాటి రాజేశ్వరి ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మరియు ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

# మేడారం వనదేవతల జాతరలో మండమెలగ పండగ ఆదివాసి పూజారులు



ములుగు(ప్రశ్నన్యూస్)మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతలకు నేడు ఆదివాసి సాంప్రదాయాల నడుమ గిరిజన పూజారులు సమ్మక్క పూజా మందిరాన్ని పూజా సామాగ్రిని శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని బొడ్రాయి అమ్మవారికి చీరాసారతో పసుపు, కుంకుమలతో అలంకరించి యాటలతో మొక్కులు చెల్లించారు.ఊరు నడుమ సొరకాయ బుర్ర, మామిడి తోరణాలు, నల్ల కోడి పిల్లతో కట్టడి చేసి జాతరకు విచ్చేసి మొక్కులు చెల్లించే భక్తులకు, గ్రామానికి ఎలాంటి కీడుసంకించకుండా పూజలు నిర్వహించారు.నేటి నుంచి వన దేవతల జాతరకు మొక్కులు చెల్లించే భక్తుల తాకిడి ఎక్కువవ్వడంతో గద్దెల ప్రాంగణాలు భక్తుల తాకిడితో కిటకిటలాడుతున్నాయి.

# బోయిన్ పల్లి మార్కెట్లో అవినీతి ఆకు కూరల దందా.?

- ఆకు కూరల రాకింగ్ స్టార్ ఎవరు.?
- అధికారుల దృష్టికి రాకుండా అంతా గప్ చుప్ బిజినెస్
- యార్డులో కూరగాయలు అమ్మాల్సిన చోట, ఆకు కూరలు కహానీ ఎంటీ
- రైతు వద్ద కొనాల్సిన ఆకు కూరలు గుడ్డిమల్కపూర్, మాధన్న పేట్ ఇతర ప్రాంతాల నుంచి తరలి రావడం విడ్డూరంగా ఉంది రిటైల్ మార్కెట్లో కొనుగోలు,
- బోయిన్ పల్లి మార్కెట్లో విక్రయిస్తున్న అస్మదీయులు





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) భూమిలో పండె ప్రతి గింజా వ్యవసాయ శాఖ అధికారులు అనుమతితో సంబంధింత యార్డులో విక్రయాలు జరగాలి.కానీ తెలంగాణ రాష్ట్రంలో దళారులు ఎత్తుగడలు అధికారులు కళ్లు గప్పె విధంగా ఉన్నాయి.రాష్ట్రంలో వ్యవసాయ శాఖ గుర్తించి రైతులకు అందుబాటులో ఉండేలా "193" మార్కెట్ యార్డులు ఏర్పాటు చేశారు.అయితే ప్రతి ఒక మార్కెట్ యార్డుకు ఓ ప్రత్యేకత ఉంటుంది.ఉదాహరణకు వంటి మామిడి కూరగాయల మార్కెట్ యార్డులో కూరగాయలు తప్ప మరేమీ విక్రయించకూడదు,మిర్చి,పత్తి,వడ్లు,పండ్లు,పువ్వులు విక్రయించరాదు.అదెవిధంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో కూరగాయలు తప్ప మరేమీ వ్యాపారం జరగకూడదు. వ్యవసాయ చట్టం ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవచ్చు.ఎందుకంటేతెలంగాణ వ్యవసాయ శాఖ
ప్రతి యార్డుకు ఓ సాఫ్ట్వేర్ రూపకల్పన చేసిన విషయం అందరికి తెలిసిందే.కానీ బోయిన్ పల్లి మార్కెట్లో మాత్రంకార్యదర్శి దృష్టికి రాకుండా అస్మదీయులు, సిబ్బంది కలిసిపెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**బోయిన్ పల్లి మార్కెట్ గ్రౌండ్ రిపోర్ట్ :**
మాధన్న పేట్,గుడ్డిమల్కపూర్, రంగారెడ్డి పలు ప్రాంతాల్లో నుంచి రిటైల్ మార్కెట్లో ఆకు కూరలు కొనుగోలు చేసిన సరుకును డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డుకు తరలించి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు.మొన్న మంగళవారం ఉదయం 5:52నిమిషాలకు టిఎస్ 08 యూఈ 7148 నెంబర్ గల టాటా ఏసీ వాహనం బోయిన్ పల్లి మార్కెట్ కి రావడం జరిగింది."ఇక్కడే అసలు కిటుకు" మొదలు.యార్డులో ప్రతి వాహనం గేట్ ఎంట్రీ కావాల్సిందే , ఆనవాయితీ ప్రకారం ఈ టాటా ఏసీ వాహనం కూడా గేట్ ఎంట్రీ అయ్యింది.కానీ పేరు వివరాల్లోకి వెళితే సంబంధించిన సదరు వ్యక్తి భాస్కర్ వెజ్ పేరు పై నమోదైనట్లు సమాచారం.సాధారణంగా సదరు కమీషన్ ఏజెంట్ పై సరుకు వివరాలు ఈ విధంగా ఉంటాయి, ఆసామి పేరు, ఊరు, సరుకు వివరాలు, దాని విలువ, ఉదాహరణకు టమాటా అయితే బాక్స్ లులెక్కిస్తారు.క్యారెట్ ,ఇతర కూరగాయలు సంచులు రూపంలో లెక్క తెలుస్తారు.ఇదియార్డులో నిత్యం జరిగే ప్రక్రియ.కానీ ఈ ఆకు కూరలుసదరు వ్యక్తి "భాస్కర్ వెజ్" పేరు పై నమోదు అయ్యింది తప్ప దాని విలువ మరె ఇతర సమాచారం లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది.అదిగాక సదరు వ్యక్తి సీజనల్ లో వంకాయలు వ్యాపారం చేస్తాడని సమాచారం.ఇదిలా ఉంటే రాత్రి నుంచి ఉదయం వరకు గేట్ ఎంట్రీ అయిన వివరాలు ద్వారా సిబ్బంది వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్స్ కమీషన్ ఏజెంట్లు వద్దకు వెళ్ళి బిడ్డింగ్ వేస్తూ డీఈఓ లకు వివరాలు అందజేస్తారు.ఆ బిడ్డింగ్ ద్వారా అందిన సమాచారం ప్రకారం మార్కెట్ ఫీజు పట్టిక తయారౌతుంది.కానీ తెల్లవారుజామున వచ్చిన ఆకు కూరలు ఉదయం ఎనిమిది గంటల వరకే ఎనభై శాతం విక్రయాలు జరుగుతాయి.
మిగిలిన దానికి నామ రూపంలో బిడ్డింగ్ చేస్తారనేదివిశ్వసనీయ సమాచారం.అసలు వీరిని ఎవరు ప్రోత్సాహిస్తున్నారు ? బోయిన్ పల్లి మార్కెట్లో వీరికి చోటే లేదంటే వీరితో నిత్యం గొడవలు.అసలు వీళ్ళ వల్ల మార్కెట్ కి లాభం పక్కకు పెడితే నష్టం నూరు శాతం ఉన్నట్లు కమిషన్ ఏజెంట్ల అభిప్రాయం.మురిగిపొయిన ఆకు కూరలు చెత్తలో వేయాలి తప్పకాని, బయోగ్యాస్ కేంద్రానికి తరలించే పరిస్థితి కూడా లేదు.కానీ ఆకు కూరలు వల్ల రైతుకన్న అధిక లాభాలు అస్మదీయులు జేబుల్లోకి వేళ్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.మరో నూతన విషయం ఏమిటంటే నిన్న ముసపేట్ లైన్లో కొత్తగా ప్రారంభించిన ఆకు కూరలు స్టాల్.దీని వెనుక ఉన్న వారు ఎవరో అధికారులే తేల్చాలి. బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో బహిరంగంగానే కొంతమంది ట్రైడర్స్ వీరి వల్ల నష్టమే తప్ప ఎలాంటి లాభం లేదంటూ, త్వరలో ఉన్నత శ్రేణి అధికారికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

# ప్రజాప్రతినిధుల అండతో అక్రమ నిర్మాణాలు

- నోటీసులు జారీ చేసి చోద్యం చూస్తున్న అధికారులు
- అక్రమ నిర్మాణాల వద్దకు పోవద్దంటూ హుకుం జారీ చేస్తున్న ప్రజాప్రతినిధులు
- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడంలో ఉప్పల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులే టాప్
- అధికారుల అండతో రహదారులపైనే కమర్షియల్ అక్రమ నిర్మాణాలు
- 70 గజాలలో అక్రమ సెల్లార్ 5 అంతస్తుల భవనం అధికారుల అవినీతికి నిదర్శనం

**కాప్రా (ప్రశ్న న్యూస్)** కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు కొదవ లేకుండా పోయింది. ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి అధికారుల అవినీతికి నిదర్శనంగా మారింది కాప్రా సర్కిల్. ఇక్కడ అక్రమ నిర్మాణాలు చేయాలంటే అతి సులువు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మామూళ్లు ఇచ్చామా అక్రమ నిర్మాణాలు చేసుకున్నామా అన్నట్లు మారింది పరిస్థితి ఏగంగా రహదారిపై అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ప్రజాప్రతినిధుల పేరు చెప్పి కాలం వెల్లబుచ్చుతున్నారు. హెచ్ బి కాలనీ మీర్పేట్ పరిధిలో అంబికా వైన్స్ పక్కకు 70 గజాల స్థలంలో అక్రమ సెల్లార్ 5 అంతస్తుల అక్రమ నిర్మాణం రహదారిపై జరుగుతుంటే అధికారులు మాత్రం నోటీసులు జారీ చేశామంటూ మౌనం వహిస్తున్నారు.
ఏమైనా ప్రశ్నిస్తే ప్రజాప్రతినిధుల పేరు చెబుతున్నారు ఇలా జిహెచ్ఎంసి కి రావలసిన ఆదాయం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి గండి కొడుతుంటే జిహెచ్ఎంసి నష్టంలో కాకుండా లాభాలలో ఉంటుందా అన్నదే ఇప్పుడు ప్రశ్న. కాప్రా సర్కిల్ పరిధిలో మాత్రం రహదారులపైనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.



## ప్రజా ప్రతినిధుల పేరుతో నిర్మాణాలు...

ఉప్పల్ నియోజకవర్గం లో అవినీతి అక్రమాలకు మద్దతుగా నిలుస్తున్నారు ప్రజాప్రతినిధులు, అధికారులు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం సిగ్గుచేటుగా మారిందని ప్రతిపక్ష నాయకుల ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి నియమనిబంధనలు పాటించడం ప్రజలకు నేర్పించవలసిన ప్రజా ప్రతినిధులు అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచి అధికారులు రావద్దంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇలా అధికార దుర్వినియోగం చేయడంలో ఉప్పల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ముందున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గ మొత్తంలో ప్రజాప్రతినిధుల అండతోనే ఇంత భారీ అక్రమ నిర్మాణాలు అది కూడా రహదారుల పైనే జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు అధికంగా ఉండడంతో ఇంకా అవినీతిలోనే కొనసాగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపవలసిన ప్రజా ప్రతినిధులు వాటికి అండగా నిలిచి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు ఇలా ఉంది ఉప్పల్ నియోజకవర్గ పరిస్థితి. గతం కంటే మరింత దిగజారిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి అవినీతి అక్రమాలను ప్రోత్సహించకుండా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

# ఐఎన్టియుసి రంగా రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎంగలి ప్రసాద్




హైదరాబాద్(ప్రశ్న న్యూస్) రంగ రెడ్డి జిల్లా అమంగల్ గ్రామానికి చెందిన ఎంగలి ప్రసాద్ ను ఐ ఎన్ టి యు సి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్దారం హైదరాబాద్ లోని రాష్ట్ర కార్యాలయంలో నేడు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష పదవి స్వీకరించటం సంతోషంగా ఉందని ఎంగలి ప్రసాద్ అన్నారు. చేనేత కార్మిక కుటుంబం నుండి వచ్చిన నన్ను రాష్ట్ర కమిటీ గుర్తించి ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదములు తెలిపారు. గత పదిహేను సంవత్సరాలుగా అనేక మంది కార్మికులను రక్షించటంతో పాటు అనేక స్వచ్ఛంద కార్యక్రమాలతో ప్రజలతో మమేకం అవ్వటంలో ప్రధాన పాత్ర పోషించిన అనుభవంతో పాటు కాంగ్రెస్ పార్టీ గెలుపు లో తనవంతు పాత్ర పోషించటం కూడా ఇప్పుడు నాకు కలిసి వచ్చే అంశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోరింగ్ శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ్యాతరి సుదర్శన్, జాయింట్ సెక్రటరీ పి కుషాల్ కుమార్ మహిళా విభాగం అధ్యక్షులు శరణ్యా రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్మదా రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు మేరావత్ లక్ష్మణ్ బిజినా పల్లి మండల మాజీ అధ్యక్షులు మ్యాతరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పేద, మధ్యతరగతి ప్రజల పక్షపాతి సీఎం జగనన్న



**నెల్లూరు** పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తూ వారి మన్ననలు పొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 12వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ అల్లీపురం గ్రామంలో ఏపీ టీడ్కో ఆధ్వర్యంలో నిర్మించిన 15,500 గృహాలను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కాకాని గోవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సురేష్ లతో కలిసి ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొంత ఇంటిని పొందేందుకు వేలాదిగా విచ్చేసిన లబ్ధిదారులను ఉద్దేశించి ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రసంగించారు. నిత్యం పేద, మధ్యతరగతి ప్రజల శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, సంక్షేమ ఫలాల ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా మహిళల ఖాతాలోకి జమచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి చెప్పారు. ఇంత పెద్ద సంఖ్యలో 15,500 గృహాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించి లబ్ధిదారులకు అన్ని మౌలిక వసతులు కల్పించి అందించడం బహుశా రాష్ట్ర చరిత్రలో గొప్ప శుభ పరిణామంగా భావించవచ్చని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ప్రజలకు మంచి చేసే ముఖ్యమంత్రి కావాలో...?? నిత్యం ప్రజలకు అబద్ధాలు చెబుతూ మోసం చేసే ముఖ్యమంత్రి కావాలో...?? ప్రజలు ఒక్కసారి విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సూచించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అండగా వైఎస్ఆర్సిపి బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలు ప్రసంగిస్తూ వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సంయుక్తంగా ప్రజలను కోరారు. వివాదరహితులు, అజాతశత్రువు, ఎప్పుడు తన నియోజకవర్గం ప్రజల శ్రేయస్సు కోసం అభివృద్ధి కోసం ఆరాటపడే ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి లాంటి మంచి వ్యక్తి నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రజలకు దొరకడం అదృష్టమని అటువంటి మంచి వ్యక్తిని రానున్న ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కానుక ఇవ్వాలని ఇరువురు మంత్రులు పిలుపునిచ్చారు. ఇంతవరకు ఎటువంటి సొంత గృహము లేని తమకు సొంత ఇంటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కరతాలధ్వనులతో గృహాలు పొందిన లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు ఆనం అరుణమ్మ, నెల్లూరు నగర మేయర్ కోట్లూరు స్రవంతి జయవర్ధన్, నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రేడ్డి రంగారెడ్డి, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, వైఎస్ఆర్సిపి జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు మొయిల్లా గౌరీ, మంగళపూడి శ్రీకాంత్ రెడ్డి, పాలకీర్తి రవికుమార్, పొట్లూరు జయవర్ధన్ రూరల్ నియోజకవర్గం కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు టీడ్కో ఎండి, డైరెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భాధ్యతలు స్వీకరించిన రూరల్, అర్బన్ ఎంపీడీవో లు రమాదేవి ,విజయలక్ష్మి

**జగిత్యాల** జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవోగా నీర్ల రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. అటు జగిత్యాల అర్బన్ మండల పరిషత్ ఎంపీడీవోగా వేముల విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.
వేరు వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోలకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీవో సలీం, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, టైపిస్ట్ లు మాధవి, రమ్య, ఈజీఎస్ ఆపరేటర్ లక్ష్మణ్, సిబ్బంది భాస్కర్, వెంకటరమణ, ప్రవీణ్, పర్యవేక్షకులు గంగాధర్, కార్యాలయ సిబ్బంది,ఈ పంచాయతీ ఆపరేటర్లు, ఉపాధి హామీ పథకం ఏపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్రిక్తంగా రైతుల ఆందోళనలు

తీవ్ర ఉద్రిక్తతలు జరిగిన విషయం తెలిసిందే. బారికేడ్లు, ముళ్ల కంచెలు దాటేందుకు అన్నదాతలు ప్రయత్నించగా వారిపై పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లతో దాడికి దిగారు. దీంతో అన్నదాతలు చెల్లాచెదురు అయిపోయారు. ఈ క్రమంలోనే సింగు సరిహద్దు వద్ద పెద్దఎత్తున చేరుకున్న రైతులు అక్కడ పతంగులు ఎగురవేస్తూ సందడి చేసారు. అయితే రైతులు పతంగులు ఎగురవేయడానికి ఒక ప్రత్యేక కారణం ఉంది. రైతులు సరిహద్దులు దాటకుండా పోలీసులు వివిధ రకాలుగా రోడ్లను దిగ్బంధించారు. బారికేడ్లు, సిమెంట్ దిమ్మెలు, ముళ్ల కంచెలు సహా అనేక లైన్లుగా అడ్డుకట్టలు వేశారు. అంతే కాకుండా అన్నదాతలను చెదరగొట్టేందుకు డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్ క్యానిస్టర్లను రైతులపైకి వదులుతున్నారు. ఈ క్రమంలోనే డ్రోన్లను ఎగురనీయకుండా వాటికి అడ్డంగా పతంగులను ఎగురవేస్తున్నారు. దీంతో డ్రోన్లు ఎగరేయడం పోలీసులకు కష్టంగా మారుతుందని భావిస్తున్నారు. మరోవైపు సింగు సరిహద్దు ప్రాంతం పంజాబ్‌లోనే ఉన్నా హర్యానా నుంచి డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నారంటూ పంజాబ్ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు.

ఈ క్రమంలోనే అంబాలా సమీపంలోని సింగు సరిహద్దు పంజాబ్ పరిధిలో ఉన్నందున డ్రోన్లు మోహరించకూడదని అంబాలా డిప్యూటీ కమిషనర్‌కు పటియాలా డిప్యూటీ కమిషనర్ ఒక లేఖ కూడా రాశారు. తాము పంజాబ్ ప్రాంతంలోనే ఉన్నప్పటికీ డ్రోన్ల ద్వారా గ్యాస్ క్యానిస్టర్లను వదులుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అవసరమైతే డ్రోన్లను కిందికి కూల్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు రైతులు ప్రకటించారు. ఇక రైతులు చేపట్టిన ఢిల్లీ ఛలో నిరసన ప్రదర్శనను అడ్డుకునేందుకు ఢిల్లీ సరిహద్దుల్లో అడుగడుగునా పటిష్ఠ భద్రతను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సెంట్రల్ ఢిల్లీతో హర్యానా సరిహద్దు పాయింట్ల వద్ద ఆంక్షలు విధించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భారీ భద్రత, కాంక్రీట్ బారికేడ్లను కూడా లెక్కచేయకుండా రైతులు ఛలో మార్చ్ కొనసాగిస్తుండటంతో సింగు సరిహద్దు వద్ద పెద్దఎత్తున రైతులు గుమిగూడారు.

# పదేళ్లు నేనే సీఎం..నువ్వెలా వస్తావో చూస్తా

పదేళ్లు ఇందిరమ్మ రాజ్యం ఉంటుంది. కేసీఆర్ మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం అంటున్నారు. ఎలా వస్తారో నేనూ చూస్తా.' అని సవాల్ విసిరారు.

## 2 లక్షల ఉద్యోగాలిస్తాం

గత బీఆర్ఎస్ హయాంలో ఏప్రిల్ 2022లో నోటిఫికేషన్ వస్తే 22 నెలలుగా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో సమస్యను అధిగమిస్తూ ఉద్యోగాలు కల్పిస్తున్నామని వివరించారు. ' టీఎస్పీఎస్సీ ప్రక్షాళన చేశాం. రాబోయే రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు కల్పించే బాధ్యత మాది. బీఆర్ఎస్ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగింది.' అని పేర్కొన్నారు.

## గాడిదను పంపి రేసుగుర్రాన్ని తెచ్చుకున్నారు

నల్గొండ సభలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కౌంటర్ ఇచ్చారు. పాలిచ్చే బర్రెను ఇంటికి పంపి దున్నపోతును తెచ్చుకున్నారని కేసీఆర్ అన్నారని అయితే, కంచర గాడిదను ఇంటికి పంపి.. రేసు గుర్రాన్ని తెచ్చుకున్నారని ఇవాళ అసెంబ్లీలో ఓ అటెండర్ తనకు చెప్పినట్లు సీఎం తెలిపారు. 'స్వరాష్ట్రం వచ్చాక బాధలు తీరుతాయని నిరుద్యోగులు ఆశించారు. అయితే, కేసీఆర్ పాలనలో వారి ఆశలు అడియాశలయ్యాయి. ఉద్యోగాల భర్తీపై అధికారులతో సమీక్షించి అన్ని ఆటంకాలు తొలగించాం. నియామక పత్రాలు ఇంటికే పంపొచ్చు కదా? అని హరీష్ రావు అంటున్నారు. ఉద్యోగాలు పొందిన మీ కళ్లలో ఆనందం చూస్తేనే నాకు నిద్ర పడుతుంది. మీ ఆనందాన్ని మేమూ పంచుకుంటాం. కుటుంబ సభ్యులకే కేసీఆర్ పదవులు, ఉద్యోగాలు ఇచ్చారు. రాష్ట్ర యువత ఏం పాపం చేసిందని ఉద్యోగాలు ఇవ్వలేదు. శాసనసభకు రమ్మంటే ఆయన రాలేదు. నల్గొండ వెళ్లి బీరాలు పలికారు. కృష్ణాలో నీటి వాటాలపై సీఎంగా కేసీఆర్ పెట్టిన సంతకాలు తెలంగాణ ప్రజల మరణ శాసనాలు. అవి మన పాలిట గుదిబండగా మారాయి. మళ్లీ నీళ్ల అంశాన్నే ఎత్తుకుంటున్నారు. ఢిల్లీతో కొట్లాడుదామంటే కేసీఆర్ ఇంటి నుంచి బయటకు రావట్లేదు. మేడిగడ్డ మేడిపండు చందంగా మారింది. పొట్ట విప్పితే అన్నీ పురుగులే ఉన్నాయి.' అంటూ రేవంత్ మండిపడ్డారు.

# ఎన్నికల వరాలు "సిద్ధం"

హామీలు దాదాపుగా అన్నింటా మహిళా లబ్దిదారులే ఉన్నారు. నాడు పెన్షన్ రూ 2 వేల నుంచి దశల వారీగా రూ 3వేలకు పెంచుతానని జగన్ హామీ ఇచ్చారు. అదే విధంగా కిందటి నెల జనవరి నుంచి రూ 3వేల చొప్పున వైఎస్సార్ పెన్షన్ కానుక అమలు చేస్తున్నారు. అదే విధంగా మహిళలకు, రైతులకు చెప్పిన విధంగా పథకాలు..రైతు భరోసా అమలు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించినా బకాయిలు కొంత మేర చెల్లించాల్సి ఉంది. వీటి చెల్లింపు పైన తాజాగా ప్రభుత్వం హామీ ఇచ్చింది.

## మేనిఫెస్టో సిద్ధం

ఇప్పటికే టీడీపీ గత మహానాడు సమయంలో సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమ మేనిఫెస్టో ప్రకటించింది. దీనిని ఇప్పుడు ప్రతీ ఇంటి బలంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయనే ధీమాతో ఉండటంతో తాము సంక్షేమంతో ప్రజల్లోకి వెళ్లాలని డిసైడ్ అయింది. ఇక, అమలు చేసే హామీలే ఇస్తాము హామీ ఇస్తే అమలు చేస్తామనే విధంగా జగన్ వచ్చే ఎన్నికల మేనిఫెస్టో ప్రకటనకు సిద్ధమయ్యారు. ఈ నెల 18న అనంతపురం జిల్లాలో జరిగే సిద్ధం సభలో తన ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనున్నారు. అందులో రైతు రుణమాఫీ ప్రకటన చేస్తారని పెద్ద ఎత్తున పార్టీలో ప్రచారం సాగుతోంది. ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా హామీల ప్రకటనలు ఉంటాయని చెబుతున్నారు. 2014 ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ పైన ప్రకటన చేయమని పలువురు కోరినా నాడు సాధ్యం కాని హామీ ఇవ్వనని తానే ప్రకటన చేయని విషయాన్ని తాజాగా అసెంబ్లీలో జగన్ గుర్తు చేసారు.

## ఎన్నికల వరాలు

ఇప్పుడు జగన్ రుణమాఫీ నిర్దేశిత మొత్తం వరకు చేస్తానని హామీ ఇవ్వటం ఖాయమని భావిస్తున్నారు. సామాజిక పెన్షన్ రూ 3 వేల నుంచి రూ 4వ వేలకు పెంచుతారనే అంచనాలు ఉన్నాయి. అదే విధంగా మహిళా ఓట్ బ్యాంక్ ను ప్రధానంగా నమ్ముకున్న జగన్ మధ్య, దిగువ తరగతి మహిళలకు ఆర్దికంగా తోడ్పాటు అందించటంతో పాటుగా వారి స్వశక్తి మీద ఎదిగేలా కొత్త ప్రణాళికలను ప్రకటించేందుకు సిద్దం అయ్యారని తెలుస్తోంది. 2019 లో ప్రకటించిన పథకాలను కొనసాగిస్తూనే వారికి ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందేలా కీలక పథకం ప్రతిపాదన చేయనున్నట్లు సమాచారం. ఉద్యోగ సంఘాలతోనూ త్వరలో ప్రభుత్వం చర్చలు చేయనుంది. వారికి ఐఆర్ ప్రకటన దిశగా నిర్ణయం ఉంటుందని సమాచారం. దీంతో అనంతపురం సభా వేదికగా జగన్ ప్రకటించే ఎన్నికల వరాల పైన ఉత్కంఠ కొనసాగుతోంది.

# మీడియా పాయింట్ వద్దకు నో ఎంట్రీ

మాట్లాడనివ్వరా.? అంటూ నిలదీశారు. సీఎం స్థాయికి తగని విధంగా, దుర్మార్గంగా మాట్లాడుతున్నారని ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం ఖూనీ చేస్తోందంటూ నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొంది.

## స్పీకర్ మౌఖిక ఆదేశాలు

మీడియా పాయింట్ లో మాట్లాడకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ సెక్యూరిటీ అధికారి అడ్డుకున్నారు. అయితే, ఇందుకు సంబంధించిన రూలింగ్ కానీ రాతపూర్వక ఆదేశాలు ఏమన్నా ఉంటే చూపించాలని వారు డిమాండ్ చేశారు. స్పీకర్ మౌఖిక ఆదేశాలు ఇచ్చారని అసెంబ్లీ భద్రతా సిబ్బంది, పోలీసులు బీఆర్ఎస్ నేతలకు తెలిపారు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, స్పీకర్ తో మాట్లాడి అనుమతి తీసుకొని చెప్తానని చెప్పిన అధికారులు.. స్పీకర్ అనుమతి ఇవ్వలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు చెప్పారు. ఈ క్రమంలో వారు అడ్డుకున్న చోటే బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ నిరసనలో కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ఇదేమి కంచెల పాలనా.?

అనంతరం, బైఠాయించిన చోటే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడారు. 'అసెంబ్లీలో సీఎం రేవంత్ అనుచిత భాషను ఖండిస్తున్నాం. చెప్పలేని భాషలో ఆయన మాట్లాడుతున్నారు. అవి అసెంబ్లీ రికార్డులకు వెళ్తున్నాయి. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని మేము కోరుదామంటే స్పీకర్ మాకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. సీఎం భాషకు ధీటుగా బదులు ఇవ్వగలం.. కానీ పార్లమెంటరీ సంప్రదాయాల మీద మాకు గౌరవం ఉంది. ప్రతిపక్ష నేత కేసీఆర్ పై సీఎం దిగజారి మాట్లాడుతున్నారు.

దీనిపై ప్రశ్నిద్దామంటే అసెంబ్లీలోనూ అవకాశం ఇవ్వడం లేదు. బయట మీడియాతో మాట్లాడతామంటే నిబంధనల పేరిట అడ్డుకుంటున్నారు. కంచెలు తొలగిస్తామని ఇదేమి కంచెల పాలనా.?' అంటూ కడియం ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశం నడుస్తుండగా మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు మాట్లాడవద్దనే నిబంధన ఏదీ లేదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తాను కూడా శాసనసభా వ్యవహారాల మంత్రిగా చేశానని.. ప్రభుత్వం కావాలనే ప్రతిపక్షం గొంతు నొక్కుతోందని మండిపడ్డారు.

### అబుదాబిలో హిందూ దేవాలయాన్ని

# ప్రారంభించిన ప్రధాని

వందలాది మంది భారతీయులు ఆలయం వద్దకు చేరుకున్నారు. "మోదీ మోదీ" అంటూ నినాదాలు చేశారు. ప్రారంభోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అబుదాబిలో నిర్మించిన తొలి హిందూ ఆలయం ఇదే కావడం విశేషం. 2015 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ యూఏఈకి రావడం ఇది ఏడోసారి. ఈ ఆలయ ప్రారంభోత్సవంపై బాప్స్ స్వామినారాయణ్ మందిరం సాధువులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. గాయకుడు శంకర్ మహదేవన్‌తో పాటు నటుడు అక్షయ్ కుమార్ పాల్గొన్నారు. ఇలాంటి గొప్ప పనులు ప్రధాని మోదీతోనే సాధ్యం అవుతాయని శంకర్ మహదేవన్ ప్రశంసలు కురిపించారు. ప్రారంభోత్సవానికి ముందు ఆలయానికి ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. రెండు రోజుల పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ ఇప్పటికే యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య మైత్రిని మరింత ముందుకు తీసుకెళ్లడంపై కీలక చర్చలు జరిపారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ప్రధాని నరేంద్రమోదీ యూఏఈలో తొలి భారత మందిరాన్ని ప్రారంభించారు.

# తెలంగాణ బీజేపీఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి నియామకం

ఏదోక వివాదంలో ఉంటారు. దీంతో గోషామహల్ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయనకే బీజేపీఎల్పీ నేతగా అవకాశాలు ఉన్నాయి. కానీ రాజాసింగ్ వివాదస్పద నేత కావడంతో ఏలేటి వైపు బీజేపీ అధిష్టానం మొగ్గు చూపింది. ఏలేటికి వివాదరహితుగా పేరుంది. పార్టీ నేతలందరితో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎలాంటి వివాదాల జోలికి పోకుండా అందిరితో కలిసి మెలిసి ఉంటారు. ఏలేటికి బీజేపీఎల్పీ నేతగా అవకాశం కల్పించడానికి అది కూడా ఒక కారణంగా తెలుస్తోంది.

# తెలంగాణ అసెంబ్లీలో వాటర్ వార్

కుంగిపోతే అందులో నీళ్లు నింపడానికి అవకాశం ఉంటదా?, కడియం శ్రీహరి, హరీష్ లకే పెత్తనం ఇస్తాం నీళ్లు నింపి చూపించండి. చర్చకు సిద్ధమైతే మీ సభాపక్ష నేతను అసెంబ్లీకి రమ్మనండి. కాళేశ్వరంపై, నదీ జలాలపై చర్చకు మేం సిద్ధం.' అని స్పష్టం చేశారు.

## చచ్చిన పామును ఎవరైనా చంపుతారా.?

బొక్కబోర్లా పడ్డ బీఆర్ఎస్ కు బుద్ధి రాలేదని కేసీఆర్ అనే పాము మొన్నటి ఎన్నికల్లోనే చచ్చిపోయిందని చచ్చిన పామును చంపాల్సిన అవసరం ఎవరికి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. 'ఇప్పటికే తెలంగాణ ప్రజలు కేసీఆర్ ఫ్యాంట్ ఊడదీశారు. ఇప్పుడు చొక్కా లాగుతారు. మేడిగడ్డ, కాళేశ్వరంపై చర్చకు సిద్ధంగా ఉన్నాం. మేడిగడ్డలో కూలింది రెండు పిల్లర్లే అయితే వాటి మీదైనా మాట్లాడేందుకు కేసీఆర్ సభకు రావాలి. గురువారం సాయంత్రం వరకైనా కేసీఆర్ సభకు వస్తే చర్చిద్దాం. అవసరమైతే సాగునీటి ప్రాజెక్టులపైనా శ్వేతపత్రం విడుదల చేస్తాం. ప్రతిపక్ష నాయకుడిని సభకు రమ్మనండి. అవినీతి బయటపడుతుందనే సభకు రాకుండా పారిపోయారు.' అంటూ సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆయన భాష సరికాదంటూ సీఎం తీరను నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. అయితే, కృష్ణా, గోదావరి జలాలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ కు ఆసక్తి లేదని.. అందుకే సభ నుంచి వెళ్లిపోయారంటూ కాంగ్రెస్ సభ్యులు అన్నారు.

## అందరికీ ఛాన్స్ ఇవ్వండి

అంతకు ముందు కడియం శ్రీహరిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు రికార్డు నుంచి తొలగించాలని కేటీఆర్ అన్నారు. వాళ్లు 64 మంది ఉన్నారని తాము 39 మంది ఉన్నామని అధికార పక్షం అడిగిన వెంటనే మైక్ కట్ చేయడం సరికాదని అన్నారు. కేసీఆర్ పై కోపంతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. సభ్యులందరినీ ఒకేలా చూడాలని స్పీకర్ ను ఉద్దేశించి అన్నారు.

## మేం చర్చకు సిద్ధం

అటు, కృష్ణా, గోదావరి జలాలపై శ్వేతపత్రంపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, సీఎం రేవంత్ వాడే భాషపైనే తమకు అభ్యంతరం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. 'రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్ని విషయాలైనా మాట్లాడవచ్చు. సీఎంగా తెలంగాణ ప్రజల ప్రతినిధిగా నిండు సభలో సహనం కోల్పోతే ఎలా.? సీఎం వాడరాని భాష వాడితే సరికాదు.' అంటూ పేర్కొన్నారు. ఈ క్రమంలో సభలో తీవ్ర గందరగోళం నెలకొని వాదోపవాదనలకు దారి తీసింది.

# తెలంగాణలో భారీగా బదిలీలు

హైదరాబాద్ సిటీ-1 అడిషనల్ డీఎస్పీగా ఎస్ రంగారావు, భూపాలపల్లి అడిషనల్ డీసీపీగా నరేశ్‌కుమార్, అక్టోపస్ అడిషనల్ ఎస్పీ హనుమంతరావును నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఏసీపీ సీహెచ్ శంకర్ రెడ్డిని మేడ్చల్ ఏసీపీగా బదిలీ చేయగా ఆ స్థానంలో ఉన్న ఏసీపీ సామల వెంకట రెడ్డిని సుల్తాన్ బజార్‌కు ట్రాన్స్‌ఫర్ చేసింది ప్రభుత్వం. అంబర్ పేట్ డీఎస్పీ జి. జగన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఏసీపీగా బదిలీ చేయగా ఆ స్థానంలో ఉన్న ఏసీపీ ఎస్ సైదయ్యను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఇక టీఎస్ ట్రాన్స్‌కో డీఎస్పీ కే శివరామ్ రెడ్డిని కూడా డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. డీఎస్పీ చంద్రభానును ఇల్లందు ఎస్‌డీపీఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎస్పీ ఏ కృష్ణయ్యను ఎల్బీనగర్ ఏసీపీగా బదిలీ చేసింది సర్కారు.

# విద్యామంత్రిని నియమించాలి

**హైదరాబాద్** రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలంటూ... బషీర్ బాగ్ లోని నిజాం కాలేజీ గేటు ముందు టిఆర్ఎస్వీ ఆందోళనకు దిగింది. విద్యార్థుల సమస్యలను చెప్పుకునేందుకు సంబంధిత శాఖ మంత్రి లేకపోవడం దారుణమన్నారు.

త్వరలో ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ జరగనున్నాయని... అప్పటిలోగా విద్యాశాఖ మంత్రి ను నియమించాలన్నారు. అయితే నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న ఎల్బీ స్టేడియంలో సీఎం కార్యక్రమం ఉండటంతో... ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులను అబిడ్స్ పోలీసులు అరెస్ట్ చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

### పుట్ట రాము హత్యకేసులో

# మరో నిందితుడు అరెస్టు

**హైదరాబాద్** రియల్టర్ పుట్ట రాము హత్య కేసులో పోలీసులు మరొకరిని అరెస్ట్ చేశారు. మాదాపూర్కు చెందిన రౌడీషీటర్ జిలానీని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత రాత్రి గణపతి అనే మరో నిందితుడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటి వరకు ఇద్దరు మహిళలు సహా 10 మందిని అరెస్ట్ చేసారుఉ. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఇంటర్ విద్యార్ధి ఆత్మహత్య

### - తల్లిదండ్రుల అందోళన

**అనకాపల్లి** అనకాపల్లి నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మచ్చకర్ల వంశీ తన స్వగ్రామం బుచ్చయ్యపేట మండలం చిట్టీయపాలెంలో గత సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యచేసుకున్నాడు.

8

ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాలేజీ యాజమాన్యం వేధింపుల వలనే వంశీ ఆత్మహత్య చేసుకున్నాడంటు తల్లిదండ్రుల ఆరోపణ.. విద్యార్ధి సంఘాలతో కలిసి మృతుని

# రేవంత్ రాజీనామా చేస్తే సీఎంగా ప్రమాణం చేస్తా

చూపిస్తున్నారని మండిపడ్డారు.

## కాళేశ్వరం తెలంగాణకు వరదాయిని

కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మీరెంత తక్కువ చేసి మాట్లాడినా అది ముమ్మాటికి తెలంగాణకు వరదాయిని. తెలంగాణ ప్రజలకు జీవ ధార అని హరీష్ రావు స్పష్టం చేసారు. లోయర్ మానేరు నుంచి సూర్యపేట దాకా, నిండిన చెరువులు, పండిన పంటలు, భూమిలో పెరిగిన ఊటలు, మోటారు లేకుండనే ఉబికివస్తున్న బోర్ల పంపులు ఇవన్నీ కాళేశ్వరం ఫలాలేనన్నారు. కూడెల్లి వాగు పొంగిందన్నా, హల్దీ వాగు దుంకిందన్నా, అన్నపూర్ణ రిజర్వాయర్ నిండిందన్నా, రంగనాయక్ సాగర్ నిండిందన్నా, మల్లన్న సాగరం నిండిందన్నా, కొండ పోచమ్మ సాగర్ నిండిందన్నా అది కాళేశ్వరం ప్రసాదించిన ఫలితమేనన్నారు. పెరిగిన పంటరాశుల్లో ప్రతిబింబించింది కాళేశ్వరమే. ఇవాళేదో రెండు పిల్లర్లు కుంగినయని, తెలంగాణకు ప్రాణాధారమైనజీవాధారను మీరు అవమానిస్తున్నరు. అలక్షంచేస్తున్నరు. రాయకీయ లబ్ధి కోసం మొత్తం ప్రాజెక్టునే డ్యామేజ్ చేయాలనే దుష్ట పన్నాగం పాల్పడుతున్నారని ఆరోపించారు.

## రిపేర్లు చేయించలేకపోతే రాజీనామా చేయండి

కుంగిన పిల్లర్లకు రిపేర్లు చేయించండి పొలాలకు నీళ్లు మళ్లించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. విచారణలు జరిపించండి. బాధ్యులయిన వారిని నిరభ్యంతరంగా శిక్షించండి. కానీ ప్రజల ప్రయోజనాలకు గండి కొట్టకండి. తెలంగాణ రైతుల నోట్లో మన్ను కొట్టకండని కోరారు. కడెం వాగు ప్రాజెక్టులు కట్టంగనే కొట్టుకుపోయింది. పునరుద్ధరించారు. సింగూరు డ్యాం, ఎల్లంపల్లి, సాత్నాల ప్రాజెక్టులు కూడా కొట్టుకుపోయాయి. పుట్టగండి ప్రాజెక్టు ప్రారంభించగానే కొట్టుకుపోయింది. కాంగ్రెస్ హయాంలో పంజాగుట్టలో ఫై ఓవర్ కూలి చనిపోయారు. పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది. రాయలసీమలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఇలాంటి ఘటనలు జరిగితే కారకులపై శిక్షించి, పునరుద్ధరణ చేసి రైతులకు అన్యాయం జరగకుండా చూస్తారని గుర్తు చేశారు.

## ప్రశంసించిన కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మొన్ననే కాళేశ్వరం స్టడీ టూర్ వచ్చి, నేర్చుకున్నరు. ప్రశంసించారు. మీరేమో రాజకీయ లబ్ధి కొరకు డైవర్షన్ టూర్ పెట్టుకున్నరు. ఇంజినీర్లు నిన్న వాస్తవాలు చెబుతుంటే, వారిని దబాయించి మాట్లాడుతున్నారు. వాస్తవాలు బయటకు చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 98వేల 570 కత్త ఆయకట్టు అని చూపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్స్ ద్వారా 546 చెరువులు నింపి 39వేల ఎకరాలకు నీల్లు అందించాం. కాళేశ్వరం నీళ్లు ఎస్సారెస్పీ నీళ్లకు కలుపడం ద్వారా 2,143 చెరువులు నింపాం. తద్వారా లక్షా 67వేల ఎకరాలు నీళ్లు వచ్చాయి. దింతో పాటు ఇవి కాకుండా 17లక్షల ఎకరాలను స్టెబిలైజ్ చేశాం. మొత్తంగా 20లక్షల 33,572 ఎకరాలకు నీళ్లు అందించాం. హల్దీ వాగు, కూడవెల్లి వాగులో 20వేల ఎకరాలకు నీళ్లు అందింది. ఇదేది ఇంజినీర్లు చెప్పకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

## కాళేశ్వరం ద్వారా 20 లక్షల ఎకరాలకు సాగునీరు

మొత్తం 20 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా ప్రయోజనం అందింది. వాస్తవాలు మరుగున పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాన్నారు. కాంగ్రెస్ హయాంలో 27వేల ఎకరాలకు మాత్రమే కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల ద్వారా నీళ్లు ఇస్తే, మేము అన్ని పనులు పూర్తి చేసి 6 లక్షల 36 వేల 700 ఎకరాలకు నీళ్లు అందించాం. మేము చేసిన పనులు మీరు చేయండి. కాళేశ్వరం కాల్వలు తవ్వండి పూర్తి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వండి. నీళ్లు ఇచ్చామని చెప్పుకోండని సూచించారు. రీ ఇంజనీరింగ్ వలన ప్రాజెక్టు అంచనా వ్యయం అనివార్యంగా పెరుగుతుంది. ప్రాణహిత చేవెళ్ళ ఆంచనా విలువల 17 వేల కోట్లతో మొదలై 38 వేల కోట్లకు పెరిగి కేంద్ర జల సంఘానికి నివేదించే నాటికి 40 వేల కోట్లకు పెరిగింది. తట్ట మట్టి ఎత్తకుండానే ప్రాజెక్టు అంచనా విలువ 17 వేల కోట్ల నుంచి 40 వేల కోట్లకు ఎందుకు పెరిగినట్టా అని ప్రశ్నించారు. దయచేసి పునరుద్దరణ చర్యలు చేపట్టండి. విచారణకు మేము సిద్ధం మేము ఎలాంటి తప్పు చేయలేదు. రైతులకు న్యాయం జరిగేలా చూడండి. టెక్నికల్ సమస్య తెలుసుకొని యుద్ధప్రతిపాదికన పనులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ లేనట్లే

విజయవాడ (ప్రశ్న న్యూస్) రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ పోటీ పెడుతుందా లేదా అన్నదానిపై స్పష్టత వచ్చింది. అభ్యర్థిని నిలబెట్టే ఆలోచన లేదని చంద్రబాబునాయుడు పార్టీ నేతలకు తెలిపారు. టీడీపీ అభ్యర్థిని నిలబెడితే గట్టి పోటీ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. టిక్కెట్ దక్కని వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేస్తారని అనుకుంటున్నారు. అందుకే వైసీపీ రాజ్యసభ అభ్యర్థులు ఎమ్మెల్యేలకు బంపర్ ఆఫర్లు ఇస్తున్నారని అంటున్నారు. కానీ టీడీపీ పోటీ పెట్టకపోవడంతో వైసీపీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది.

## చంద్రబాబుతో పలువురు టీడీపీ నేతల భేటీ

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో ఉండవల్లిలోని నివాసంలో పలువురు నేతలు సమావేశం అయ్యారు. రా కదలిరా, లోకేశ్ శంఖారావం సభలతో పాటు వివిధ రాజకీయ అంశాలపై చర్చించారు. యనమల, నిమ్మల, అనగాని, గొట్టిపాటి, కంభంపాటి తో పాటు ఆనం రామనారాయణరెడ్డి కూడా కలిశారు. ఇటీవలి కాలంలో పలువురు వైసీపీ కీలక నేతలు టీడీపీలో చేందుకు వస్తున్నారని ప్రచారం జుగుతోంది. దీనిపై నేతలకు చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. వైసీపీ కీలక నేతలు టచ్ లోకి వస్తున్నారని అయితే పార్టీలో చేర్చుకునే విషయంలో ఎలాంటి హామీ ఇవ్వడం లేదని చంద్రబాబు వారికి చెప్పరు. వైసీపీ నుంచి వచ్చిన అందరినీ తీసుకోలేము అన్నీ ఆలోచించే నిర్ణయాలు ఉంటాయని చెప్పారు.

## చేరికల వల్ల పార్టీలో కష్టపడిన నేతలకు అన్యాయం జరగదు

పొత్తులు, చేరికల వల్ల పార్టీలో కష్టపడిన నేతలకు నష్టం జరగకూడదన్నారు. కష్టపడిన నేతల భవిష్యత్తుకు నష్టం జరగకుండా చూడడానికే ప్రాధాన్యం ఇస్తామని భరోసా ఇచ్చారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి ముగ్గురు ఎంపీలు, పలువురు ఎమ్మెల్యేలు పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. పలువురు చంద్రబాబుతో కూడా భేటీ అయ్యారని.. ఫలానా సీట్లు ఖరారరయ్యాని చెబుతున్నారు. ఈ అంశాలపై మరికొంత మంది నేతలు పార్టీ అధినేతతో చర్చించేందుకు వస్తున్నారు.

## అందరూ ఎన్నికల మూడ్ లోకి రావాలని సూచన

ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున అందరూ ఎన్నికల మూడ్ లోకి రావాలని పార్టీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే జిల్లాల వారీగా ఖరారైన పార్టీ అభ్యర్థులకు అనధికారిక సమాచారం ఇచ్చారు. వారు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పొత్తుల వల్ల కొన్ని నియోజకవర్గాలపై స్పష్టత లేదు. వాటి విషయంలో మాత్రం సందిగ్ధత ఉంది. బీజేపీతో పొత్తుల చర్చలు ఓ కొలిక్కి రావాల్సి ఉంది. ఈ కారణంగానే పార్టీ అభ్యర్థుల జాబితా విడుదల ఆలస్యమవుతోందని అంచనా వేస్తున్నారు. మరో వారంలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### చెల్లెమ్మ, వదినమ్మలతో


# చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలకు తెర లేపారు

### - మాజీ మంత్రి కొడాలి నాని సెటైర్లు



**అమరావతి :** చెల్లెమ్మ, వదినమ్మలతో చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలకు తెర లేపారంటూ ఏపీలోని ప్రతిపక్షాలపై మాజీ మంత్రి కొడాలి నాని సెటైర్లు విసిరారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గుంట నక్క చంద్రబాబు, బీజేపీ వదినమ్మ, కాంగ్రెస్ చెల్లెమ్మ, ఉత్త పుత్రుడు, దత్తపుత్రుడిని కట్టగట్టి బంగాళాఖాతంలో పడేయాలన్నారు. ఒంటరిగా జగన్‌ను ఎదుర్కోలేని చంద్రబాబు ఒకపక్క దత్తపుత్రుడు, మరో పక్క ఉత్తపుత్రుడు, ముందు బీజేపీ వదినమ్మను, లేటెస్ట్‌గా ఇప్పుడు కాంగ్రెస్ చెల్లెమ్మను వెనకాల నిలబెట్టుకొని ఎన్నికలకు వస్తున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. వీళ్ళందరూ ఉన్న దైర్యం సరిపోని చంద్రబాబు ఢిల్లీ పెద్దలు మబ్బులో పెడదామని వెళ్ళారన్నారు. అక్కడ ఉన్నది అమిత్ షా, మోడీ కావడంతో వాల్లిచ్చిన ఆఫర్ దెబ్బకు.... హైదరాబాద్ వెళ్లి మంచంపై పడి వారం నుండి ఏపీకి రావడం లేదంటూ విరుచుకుపడ్డారు. ఢిల్లీ పెద్దల దెబ్బతో ముందు నుయ్యి, వెనక గొయ్యిలా చంద్రబాబు పరిస్థితి మారిందని కొడాలి నాని విమర్శలు గుప్పించారు.

# పాన్ ఇండియా రేంజ్‌లో ఇస్మార్ట్ శంకర్ పార్ట్ 2




మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ పూరి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్స్ సరసన నిలిచింది. అందుకే అప్పట్లోనే ఈ కు సీక్వెల్ ఉంటుందని ఎనౌన్స్ చేశారు. కాస్త ఆలస్యమైనా ప్రజెంట్ ఈ ను ఆడియన్స్ ముందుకు తీసుకువచ్చే పనిలో ఉంది పూరి టీమ్. డబుల్ ఇస్మార్ట్ షూటింగ్ స్టార్ట్ అయిన రోజే మార్చి 8న రిలీజ్ చేస్తున్నట్టుగా ఎనౌన్స్ చేశారు మేకర్స్. అంటే సరిగ్గా ఇంకో 30 రోజుల్లో ఈ ఆడియన్స్ ముందుకు రావాలి. అది కూడా పాన్ ఇండియా రేంజ్‌లో. లైగర్ తో నిరాశపరిచిన పూరి జగన్నాథ్ షార్ట్ గ్యాప్ తరువాత తన సూపర్ హిట్ కు సీక్వెల్‌ను పట్టాలెక్కించారు. రామ్ హీరోగా సూపర్ హిట్ ఇచ్చిన ఇస్మార్ట్ శంకర్‌కు పాన్ ఇండియా రేంజ్‌లో పార్ట్ 2ను ప్లాన్ చేస్తున్నారు. అయితే షూటింగ్ స్టార్ట్ అయిన రోజే రిలీజ్ డేట్ కూడా లాక్ చేసిన పూరి. ఇప్పుడు అప్‌డేట్ విషయంలో మాత్రం సైలెంట్‌గా ఉన్నారు. లైగర్ తో తొలిసారి పాన్ ఇండియా అటెంప్ట్ చేసిన పూరి, ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయారు.దీంతో నెక్ట్స్ తో టార్గెట్ మిస్ కాకూడదని గట్టిగా ఫిక్స్ అయిన డాషింగ్ డైరెక్టర్... హిట్ ఫార్ములాకు సీక్వెల్‌ను పట్టాలెక్కించారు. రామ్, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో సూపర్ హిట్ అయిన ఇస్మార్ట్ శంకర్.మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ పూరి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్స్ సరసన నిలిచింది. అందుకే అప్పట్లోనే ఈ కు సీక్వెల్ ఉంటుందని ఎనౌన్స్ చేశారు. కాస్త ఆలస్యమైనా ప్రజెంట్ ఈ ను ఆడియన్స్ ముందుకు తీసుకువచ్చే పనిలో ఉంది పూరి టీమ్.డబుల్ ఇస్మార్ట్ షూటింగ్ స్టార్ట్ అయిన రోజే మార్చి 8న రిలీజ్ చేస్తున్నట్టుగా ఎనౌన్స్ చేశారు మేకర్స్. అంటే సరిగ్గా ఇంకో 30 రోజుల్లో ఈ ఆడియన్స్ ముందుకు రావాలి. అది కూడా పాన్ ఇండియా రేంజ్‌లో. కానీ ఇంత వరకు ప్రమోషన్స్ మాత్రం స్టార్ట్ చేయలేదు టీమ్. పాన్ ఇండియా రిలీజ్ అంటే మినిమమ్ నెలన్నర ముందు నుంచి ప్రమోషన్స్ స్టార్ట్ అవ్వాలి. కానీ డబుల్ ఇస్మార్ట్ టీమ్ మాత్రం ఇంత వరకు ఆ ఊసే ఎత్తటం లేదు. అసలు షూటింగ్ స్టేటస్ ఏంటన్న విషయంలో కూడా క్లారిటీ లేదు. మరి ఇప్పటికైనా పూరి టీమ్ ప్రమోషన్స్ షురూ చేస్తుందేమో చూడాలి.

# 'మిస్టర్ బచ్చన్' నుంచి స్పెషల్ పోస్టర్ విడుదల



'మాస్ మహారాజా' రవితేజ హిట్, ఫ్లాఫ్‌లతో సంబంధం లేకుండా సినిమా మీద సినిమా చేసుకుంటూ జెట్ వేగంతో దూసుకుపోతున్నారు. రవితేజ నటించిన 'ఈగల్' సినిమా తాజాగా విడుదలై థియేటర్లలో దూసుకుపోతుంది. ఈగల్ హిట్ ఎంజాయ్ చేస్తున్న రవితేజ.. అదే ఊపులో తన తదుపరి సినిమా 'మిస్టర్ బచ్చన్' షూటింగ్‌లో బిజీ అయిపోయారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా తాజాగా కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. నేడు 'వాలెంటైన్ డే' సందర్భంగా ఈ చిత్రం నుంచి చిత్ర యూనిట్ ఓ పోస్టర్ రిలీజ్ చేసింది.ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్ వదిలారు. రవితేజ, భాగ్యశ్రీ బోర్స్ ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకున్న రొమాంటిక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అయింది. 'రవితేజ గట్టిగానే పట్టుకున్నాడే' అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మిస్టర్ బచ్చన్‌కు 'నామ్ తో సునా హెూగా' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన లుక్‌తో కనిపించనున్నారని, ఆయన కెరీర్‌లో 'మిస్టర్ బచ్చన్' సినిమా ప్రత్యేకంగా అవుతుందని మేకర్స్ తెలిపారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మిక్కీజె మేయర్ సంగీతం అందిస్తున్నారు.



# క్యూట్ ఫొటోలతో కేకపెట్టిస్తుంది

అదితి రావు హైదరి.. చెలియా తో హీరోయిన్ గా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది ఈ అందాల భామ. ఆతర్వాత సమ్మోహనం తో సూపర్ హిట్ అందుకుంది. ఆతర్వాత వరుసగా లు చేసింది ఈ చిన్నది. అదితి రావు హైదరి.. చెలియా తో హీరోయిన్ గా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యింది ఈ అందాల భామ. చూడ చక్కని రూపంతో ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తమిళ్ లో పలు ల్లో నటించినప్పటికీ చెలియా తో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది అదితి రావు హైదరి. ఆతర్వాత ఇంద్రగంటి మోహన్ కృష్ణ దర్శకత్వం వహించిన సమ్మోహనం తో తెలుగులో సూపర్ హిట్ అందుకుంది. ఈ లో సుధీర్ బాబు హీరోగా నటించాడు. మొదటి అయినా తెలుగులో చక్కగా మాట్లాడి ప్రేక్షకులను ఆకట్టుకుంది అదితి. ఆతర్వాత వరుసగా లు చేసింది ఈ చిన్నది. సమ్మోహనం సూపర్ హిట్ అవ్వడంతో ఈ చిన్నదానికి ఆఫర్స్ క్యూ కట్టాయి. వరుసగా వరుణ్ తేజ్ తో అంతరిక్షం, నాని , సుధీర్ బాబు మల్టీస్టారర్ వి, శర్వానంద్, సిద్దార్థ్ మల్టీస్టారర్ మహాసముద్రంలాంటి లు చేసింది కానీ మంచి హిట్ మాత్రం అందుకోలేకపోయింది అదితి రావు హైదరి. తమిళ్ లోనూ ఇప్పుడు ఈ చిన్నది పెద్దగా కనిపించడం లేదు'. అక్కడ హే సినామిక అనే లో నటించింది. ఈ లో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించాడు. అలాగే కాజల్ అగర్వాల్ మరో హీరోయిన్ గా నటించింది. ఇక సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్ గా అభిమానులతో టచ్ లో ఉంటుంది. సోషల్ మీడియాలో అదితి షేర్ చేసే ఫోటోలకు మంచి క్రేజ్ ఉంది. చీరకట్టుతో పాటు మోడ్రన్ డ్రస్సుల్లోనూ అదరగొడుతుంది ఈ అమ్మడు. తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది అదితి రావు హైదరి. చీరకట్టులో ఈ అమ్మడి అందం మరింత ఎక్కువైంది అంటున్నారు ఫ్యాన్స్. ఈ ఫోటోలకు క్రేజీ కామెంట్స్ వస్తున్నాయి.

# ఓటీటీలోకి వచ్చేసిన రొమాంటిక్ లవ్ స్టోరీ



అశోక్ సెల్వన్ హీరో గా నటించిన లేటెస్ట్ మూవీ సబా నాయగన్..ఈ మూవీలో కలర్ ఫోటో ఫేమ్ చాందిని చౌదరితో పాటు మేఘా ఆకాష్ మరియు కార్తిక మురళీధరన్ హీరోయిన్లు గా నటించారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ప్రభాస్ సలార్ కు పోటీగా డిసెంబర్‌లో 22 న థియేటర్ల లో రిలీజై మంచి వసూళ్లను రాబట్టింది.సబా నాయగన్ మూవీ వాలెంటైన్స్ డే కానుకగా బుధవారం ఓటీటీలో రిలీజైంది. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ లో ఈ మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ మరియు హిందీ భాషల్లో ఈ సినిమా ను రిలీజ్ చేశారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ట్రెండింగ్ మూవీస్‌లో ఒకటిగా సబా నాయగన్ నిలిచింది. తాగిన మత్తు లో సబా (అశోక్ సెల్వన్) అనే యువకుడు న్యూసెన్స్ క్రియేట్ చేస్తాడు. అతడిని పోలీసులు అరెస్ట్ చేస్తారు. లవ్ ఫెయిల్యూర్‌తోనే సబా పిచ్చి పిచ్చిగా ప్రవర్తించాడని పోలీస్ ఆఫీసర్ అర్థం చేసుకుంటాడు. అతడి ప్రేమకథను గురించి అడుగుతాడు. సబా జీవితంలోకి వచ్చిన రియా, మేఘ, దీప్తి ఎవరు.. అస్సలు ఈ ముగ్గురిలో సబా ఎవరిని ప్రేమించాడు అన్నదే ఈ మూవీ కథ.డిఫరెంట్ టైమ్ పీరియడ్స్‌లో సాగే లవ్ స్టోరీగా దర్శకుడు సీఎస్ కార్తికేయన్ ఈ మూవీని తెరకెక్కించాడు. థియేటర్లలో ఈ మూవీ పదిహేను కోట్లకుపైగా వసూళ్లను దక్కించుకున్నది. ఈ రొమాంటిక్ లవ్ స్టోరీని స్క్రీన్‌పై ప్రజెంట్ చేసిన తీరుతో పాటు అశోక్ సెల్వన్, మేఘాకాష్, చాందిని చౌదరి యాక్టింగ్ అభిమానులను ఎంతగానో మెప్పించాయి..కాగా సబా నాయగన్ మూవీ చాందిని చౌదరి ఫస్ట్ తమిళ్ మూవీ కావడం విశేషం. కాలేజీలో సబాను ప్రేమించే యువతిగా చాందిని చౌదరి కనిపించింది.గ్లామర్ రోల్ కాకుండా యాక్టింగ్‌కు స్కోప్ ఉన్న పాత్రను ఎంచుకొని తొలి సినిమాతోనే వైవిధ్యతను చాటుకున్నది.



# వెబ్ సిరీస్‌ల్లో నటిస్తున్న ప్రియమణి

ప్రియమణి .. ఈ కేరళ కుట్టి తెలుగులో ఎన్నో ల్లో నటించి మెప్పించింది. .తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ భాషలలో దాదాపు 20 పైగా ల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది ప్రియమణి. పరుత్తివీరన్ లోని నటనకు 2006 లో జాతీయ ఉత్తమ నటి పురస్కారమును కూడా అందుకుంది ప్రియమణి. ప్రియమణి .. ఈ కేరళ కుట్టి తెలుగులో ఎన్నో ల్లో నటించి మెప్పించింది. .తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ భాషలలో దాదాపు 20 పైగా ల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది ప్రియమణి. పరుత్తివీరన్ లోని నటనకు 2006 లో జాతీయ ఉత్తమ నటి పురస్కారమును కూడా అందుకుంది ప్రియమణి. రావణ్ చిత్రం ద్వారా హిందీ చిత్రసీమ లోకి అడుగు పెట్టింది. ఇక తెలుగులో ఎవరే అతగాడు తో ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. దర్శక ధీరుడు రాజమౌళి డైరెక్షన్ లో వచ్చిన యమదొంగ తో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. నిజానికి జగపతి బాబు హీరోగా నటించిన పెళ్ళైన కొత్తలో అనే తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత 'యమదొంగ'లో జూనియర్ ఎన్టీఆర్ సరసన నటించి తెలుగు ప్రేక్షకుల మనస్సులో మంచి స్థానాన్ని సంపాదించుకుంది. అప్పటి వరకూ తెలుగింటి అమ్మాయిలా ఉన్న ప్రియ ద్రోణాతో గ్లామర్ డాల్ అవతారమెత్తింది. ఈ లో ఏకంగా బికినిలో కనిపించి షాక్ ఇచ్చింది. అప్పట్నుంచి మిత్రుడు, ప్రవరాఖ్యుడు, శంభో శివ శంభో, సాధ్యం, గోలీమార్, రగడ, రాజ్, రక్తచరిత్ర.. ఇలా చాలా చిత్రాల్లో నటించి మంచి ప్రశంసలు పొందింది.ఇక ఇప్పుడు పలు ల్లో కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ భామ. ఇప్పుడు వెబ్ సిరీస్ ల్లోనూ నటిస్తుంది. ఆహాలో టెలికాస్ట్ కానున్న భామాకలాపం సిరీస్ తో ప్రేక్షకులను అలరించనుంది ప్రియమణి. తాజాగా ఈ అమ్మడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

# ఏడాది తర్వాత ఓటీటీలోకి 'వాలంటైన్స్ నైట్'



'30 వెడ్స్ 21: వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న చైతన్య రావ్.. హీరోగా నటించిన చిత్రం 'వాలెంటైన్స్ నైట్'. దర్శకుడు అనిల్ గోపిరెడ్డి తెరకెక్కించిన ఈ సినిమాలో సునీల్, లావణ్య, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన పాత్రల్లో నటించారు. గతేడాది జనవరి 26న థియేటర్లలో రిలీజ్ అయిన వాలెంటైన్స్ నైట్ సినిమాకి మంచి టాక్ వచ్చినా.. థియేటర్లలో పెద్దగా ఆడలేదు. లవ్, డ్రగ్స్ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు రెడీ అయింది. వాలెంటైన్స్ నైట్ చిత్రం ఏడాది తర్వాత ఓటీటీలోకి వస్తోంది. ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ 'ఆహా' ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. వేలంటైన్స్ డే 2024 తర్వాతి రోజు ఫిబ్రవరి 15న ఈ సినిమాని ఓటీటీ స్ట్రీమింగ్‌కు రాబోతుంది. ఈ విషయాన్ని 'ఈటీవీ విన్' తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో చూడని వారు ఎంచక్కా ఇంట్లోనే కూర్చుని వాలెంటైన్స్ నైట్ చిత్రంను ఎంజాయ్ చేయొచ్చు.వాలెంటైన్స్ నైట్ సినిమా 2023 జనవరి 26న థియేటర్లలో రిలీజ్ అయింది. బడ్జెట్ పరంగా చిన్న మూవీగా కావడంతో.. పెద్దగా ప్రమోషన్లు కూడా చేయలేదు. దాంతో చాలా మందికి ఈ సినిమా రిలీజ్ అయిన విషయం కూడా తెలియదు. పాజిటివ్ టాక్ వచ్చినా ప్రమోషన్లు సరిగా నిర్వహించకపోవడం ఈ సినిమాకు మైనస్‌గా మారింది. అయితే ఓటీటీలో మంచి వ్యూస్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాలెంటైన్స్ నైట్ చిత్రంతో లవ్ స్టోరీతో పాటు సందేశాన్ని కూడా మేకర్స్ ఇచ్చారు. యువత జీవితాలపై డ్రగ్స్ ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయన్న అంశంను ఇందులో చూపించారు.


## 'మిస్టర్ బచ్చన్' నుంచి స్పెషల్ పోస్టర్ విడుదల

'మాస్ మహారాజా' రవితేజ హిట్, ఫ్లాఫ్‌లతో సంబంధం లేకుండా సినిమా మీద సినిమా చేసుకుంటూ జెట్ వేగంతో దూసుకుపోతున్నారు. రవితేజ నటించిన 'ఈగల్' సినిమా తాజాగా విడుదలై థియేటర్లలో దూసుకుపోతుంది. ఈగల్ హిట్ ఎంజాయ్ చేస్తున్న రవితేజ.. అదే ఊపులో తన తదుపరి సినిమా 'మిస్టర్ బచ్చన్' షూటింగ్‌లో బిజీ అయిపోయారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా తాజాగా కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. నేడు 'వాలెంటైన్ డే' సందర్భంగా ఈ చిత్రం నుంచి చిత్ర యూనిట్ ఓ పోస్టర్ రిలీజ్ చేసింది.ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్ వదిలారు. రవితేజ, భాగ్యశ్రీ బోర్స్ ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకున్న రొమాంటిక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అయింది. 'రవితేజ గట్టిగానే పట్టుకున్నాడే' అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మిస్టర్ బచ్చన్‌కు 'నామ్ తో సునా హెూగా' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన లుక్‌తో కనిపించనున్నారని, ఆయన కెరీర్‌లో 'మిస్టర్ బచ్చన్' సినిమా ప్రత్యేకంగా అవుతుందని మేకర్స్ తెలిపారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మిక్కీజె మేయర్ సంగీతం అందిస్తున్నారు.

# చేపలు తింటే అనారోగ్యం తప్పదు

## - చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు

- అనారోగ్య సమస్యలతో జనాల తిప్పలు
- కోళ్ళ వ్యర్థాలతో కోట్ల వ్యాపారాలు
- చేపలకు ఆహారంగా కోళ్ళ వ్యర్థాలు వేయడంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు
- కోళ్ళ వ్యర్థాలతో అతి తక్కువ ఖర్చుతో భారీ లాభాలు తీస్తున్న వ్యాపారులు
- అధికారుల లాలూచితో పెట్రేగిన కోళ్ళ వ్యర్థాల వ్యాపారం
- చర్యలు చేపట్టి నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలం







**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మారుచున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు పోషక విలువలున్న ఆహారానికి పెద్దపీట వేస్తున్నారు. అందున మాంసాహారులైతే చికెన్, మటన్‌తో పాటు చేపలపై మక్కువ చూపుతున్నారు. ఇలాంటి చేపల పెంపకానికీ కోళ్ల వ్యర్థాలను ఉపయోగిస్తు జనాల ఆరోగ్యంతో పాటు పర్యావరణానికీ ముప్పు వాటిల్లే ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నాయి. చెరువుల వద్ద కోళ్ల వ్యర్థాలను నిల్వ ఉంచడం వల్ల వైరస్ విస్తరించి పరిసరాల్లో ఉన్నవారు పలు అనారోగ్య సమస్యల బారినపడే పరిస్థితులు దాపురించాయి. అలాగే భూగర్భ జలాలు కలుషితమై పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని గతంలోనే కోళ్ల వ్యర్థాలను చెరువుల్లోని చేపలకు ఆహారంగా వేయడాన్ని నిషేధించారు. కానీ గత రెండుమూడేళ్ళుగా కోళ్ల వ్యర్థాల వ్యాపారం బాగా పుంజుకుంది.

కొన్నిచోట్ల మూడు, నాలుగు రోజుల పాటు నిల్వ ఉంచిన కోళ్ల వ్యర్థాలను తరలించే క్రమంలో వాయు కాలుష్యం వెదజల్లుతోంది. వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాలు వెళ్లిన మార్గాల్లో కనీసం 15-20 నిమిషాల వరకు భరించలేని దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

### వ్యర్థాలనే వ్యాపారంగా మార్చేశారు

చికెన్ దుకాణదారులు మొదట్లో కోళ్ల వ్యర్థాలను వృథాగానే పడేసే వారు. దీనిపై కొందరు స్వార్థపరుల కన్ను పడిందే తడవుగా ఈ వ్యర్థాలతోనే వ్యాపారం మొదలు పెట్టారు. ఎక్కువగా వ్యర్థాలు వచ్చే చికెన్ దుకాణాల వద్ద ప్రత్యేకంగా ప్లాస్టిక్ డ్రమ్ములను సైతం ఏర్పాటు చేశారు. అయితే కొందరు చికెన్ దుకాణదారులు వ్యర్థాలను ఈ డ్రమ్ముల్లో వేయకపోవడంతో కిలోకు రూ.5-8 వరకు లేదా డ్రమ్ముకి ఓ రేటు ఇస్తామనడంతో వ్యాపారులు సైతం వ్యర్థాలను భద్రపరిచి సంబంధిత వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన వ్యర్థాలను వాహనాల్లో తరలించి చేపల పెంపకం దారులకు కిలో రూ.15 - 20 వరకు విక్రయిస్తున్నారు.

### టన్నులకు టన్నుల తరలింపు

హైదరాబాద్ నగరంతో పాటు పట్టణాలు, గ్రామాల్లో ఉన్న చికెన్ దుకాణాల నుంచి కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. సాధారణ రోజుల్లో కొన్ని టన్నుల వరకు కోళ్ల వ్యర్థాలను చెరువులకు తరలిస్తుండగా ఆదివారం చికెన్ వినియోగం ఎక్కువగా ఉండటంతో ఆ రోజుతో పాటు మరుసటి రోజు మరింత ఎక్కువ టన్నులకు పైగా కోళ్ల వ్యర్థాలను సేకరించి చెరువులకు తరలిస్తున్నారు. సగటున రోజుకు వందల టన్నుల కోళ్ల వ్యర్థాలు తరలిపోతున్నాయంటే ఈ వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

### ఎందుకు ఈ వ్యర్థాలను వాడుతున్నారంటే

కోళ్ల వ్యర్థాలను తినడం వల్ల చేపలు త్వరగా బరువు పెరగడంతో పాటు మేత ఖర్చు కూడా తగ్గుతుంది. సాధారణంగా చేపలకు ఆహారంగా తవుడు, సోయాబీన్ వంటి వాటితో ఉత్పత్తి చేసిన మేతను వాడతారు. ఈ మేత మార్కెట్‌లో కిలో రూ.30 వరకు ఉంటుంది. కిలో చేపను పెంచడానికి సుమారు రూ.50కి పైగా ఖర్చవుతుంది. కానీ ఆరోగ్యవంతమైన చేపలు ఈ ఆహారంతో అందుబాటులోకి వస్తాయి. అదే కోళ్ల వ్యర్థాలతో కిలో చేపను పెంచేందుకు రూ.30 లోపే ఖర్చవుతుండటం, త్వరగా చేపలు బరువు పెరుగతుండటంతో వీటిపైనే కొందరు పెంపకందారులు దృష్టిసారిస్తున్నారు. అయితే ఈ చేపలను తినేవారు అనేక వ్యాధుల బారినపడతారనే విషయాన్న జనాలు గ్రహించలేక పోతున్నారు.

### కోళ్ల వ్యర్థాలను మేతగా వేస్తే రూ.50 వేల జరిమాన

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వాడితే గరిష్టంగా రూ.50వేల వరకు జరిమానా విధించే అధికారం మత్స్యశాఖ అధికారులకు ఉంది.

రెండోసారి కూడా ఇదే తప్పు చేస్తే సాగుదారుల లైసెన్సులు రద్దు చేసి, సరకు స్వాధీనం చేసుకునే నిబంధనలు ఉన్నాయి. ఇకనైనా మత్స్యశాఖ అధికారులు కోళ్ల వ్యర్థాలు వాడే వారిపై నిఘా పెంచి తగు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### కోళ్ల వ్యర్థాలతో పెంచిన చేపలను

తినడం ఆరోగ్యానికి హానికరం. కోళ్ల వ్యర్థాలతో పెంచిన చేపలను తినడం ఆరోగ్యానికి హానికరం. కాలేయ, జీర్ణకోశ సమస్యలతో పాటు పేగులో పుండ్లు, గ్యాస్ట్రిక్, మలబద్ధకం, ఫైల్స్, చర్మ వ్యాధులు వంటివి తలెత్తుతాయి. అలాగే పలు రకాల క్యాన్సర్ సమస్యలు వస్తాయి. వీటిని తిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడతారు. పైగా కోళ్ల వ్యర్థాలు ఉపయోగించే లేదా నిల్వచేసే పరిసర ప్రాంతాలు పూర్తిగా వైరస్‌తో నిండి పర్యావరణానికి ముప్పు కలిగేలా తయారవుతుంది.

అక్కడి గాలి కూడా ప్రమాదకరంగా మారుతుంది. ఈ గాలిని పీల్చేవారు త్వరగా వ్యాధుల బారిన పడతారు. ప్రభుత్వం వెంటనే ఆ సమస్యపై దృష్టి సారించి కోళ్ళ వ్యర్థాలతో వ్యాపారం చేస్తున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# బఫర్ జోన్‌లో బహుళ అంతస్తుల నిర్మాణాలు

## మల్కాజిగిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి లీలలు

- హెచ్ ఎం సి నిబంధనలకు పాతర
- ఏసిపి సెక్షన్ ఆఫీసర్ కనుసైగల్లో నిర్మాణాల జాతర
- పట్టించుకోని జోనల్ సిపి, జోనల్ కమిషనర్









**మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్)** మల్కాజగిరి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పొయింది. తీసుకున్న అనుమతులకు చేపడుతున్న నిర్మాణాలకు ఏలాంటి పొంతన లేకుండా అడ్డగోలు నిర్మాణాలు చేపడుతున్నా సర్కిల్ లో పట్టించుకునే అధికారి కరువైయ్యారు. ఉన్నత అధికారులు సైతం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా కిందిస్థాయి అధికారులతో చేతులు కలగారా.? అన్న సందేహం వేస్తుంది. మల్కాజిగిరి,గౌతంనగర్ ,మౌలాలి, నేరెడిమేట్, ఈస్ట్అనందబాగ్,వినాయక్ నగర్ డివిజన్ లలో వెలుసున్న అక్రమ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం పై భారీగా లంచాలు తీసుకున్నారని స్థానికుల నుండి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం ఏసిపి శ్రీనివాస్ యాదవ్, సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్, సిబ్బంది అందినంత దండుకోని అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం డివిజన్ పరిదిలోనే పదుల సంఖ్యలో కొనసాగుతున్న నిర్మాణాలపై ముందుగానే లంచాలు తీసుకొని అధికారుల పర్యవేక్షణ లోపించడంతో నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందిని మచ్చిగ చేసుకుంటే నిబంధనలు లేక్కలొకి రావనే దీమాతో వ్యవహరిస్తున్నారు. రెసిడెన్షియల్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని పూర్తిగా కమర్షియల్ మార్చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి బారీగా గండి కొడుతున్నారు. బండ చెరువు బంఫర్ జోన్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు వెచ్చలవిడిగా వెలుస్తున్నాయి. అధికారులు ప్రజా ప్రతినిధుల అండదండలు మెండుగా ఉండటంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుఅదుపు లేకుండా పొంతుందని స్థానికులు విమర్శిస్తున్నారు.

### ఫోన్ ఎత్తని ఏసిపి శ్రీనివాస్ యాదవ్

మల్కాజ్గిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి లీలలు అన్ని ఇన్ని కావు అక్రమ నిర్మాణాల్లో మల్కాజ్గిరి సర్కిల్ మొదటి స్థానంలో ఉంది అనడంలో ఎలాంటి సందేహం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై వివరణ కోసం అధికారులకు ఫోన్ చేస్తే అసలు ఎత్తరు ఏసీపీ శ్రీనివాస్ యాదవ్ కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆయన ఎత్తరు పట్టించుకోరు. అక్రమ నిర్మాణాలలో నెలకు ఆయనకు లక్షల్లో అక్రమ సంపాదన వస్తుంటే ఇక వాటిపై వివరణ ఇవ్వడానికి కూడా ఆయన సుముఖంగా లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. సెక్షన్ ఆఫీసర్ తుల్జాసింగ్ అవినీతి లీలలు అన్ని ఇన్ని కాదు సాక్షాత్ విజిలెన్స్ అధికారులు కొన్ని కేసుల్లో విచారణ చేసిన ఇప్పటివరకు రిపోర్టు బయట పెట్టకపోవడం చూస్తుంటే వాళ్లను కూడా మేనేజ్ చేసరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక డిసి రాజు అసలు పట్టించుకోవడం ఎప్పుడో మానేశారు నా వాటలు నాకు వస్తే చాలు అన్నట్టుగా ఆయన వ్యవహారం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా అవినీతికి కేంద్రంగా మారిన మల్కాజిగిరి సర్కిల్ పై త్వరగా ఏసీబీ దాడులు చేస్తే పెద్ద పెద్ద అవినీతి తిమింగలలో దొరుకుతాయని స్థానికులు కోరుతున్నారు.

#### డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు

# ప్రత్యేక విభాగం

## - రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,(ప్రశ్న న్యూస్)**రాష్ట్రంలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక విభాగం పనిచేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎల్బీ స్టేడియంలో కానిస్టేబుల్ల కు నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం ఎంతో మంది ఉద్యమించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేస్తుందని చెప్పారు. కానిస్టేబుల్స్ మాత్రమే కాదు మిగతా ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తామని చెప్పారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందని పేర్కొన్నార

# టీఎస్ఆర్టీసీ సరికొత్త చరిత్ర

## - ఒక్కరోజే బస్సుల్లో 65లక్షల మంది ప్రయాణం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** టీఎస్ఆర్టీసీ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒక్క సోమవారం రోజే బస్సుల్లో 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతో సరికొత్త చరిత్ర సృష్టించింది. సంస్థ హిస్టరీలోనే అత్యధికంగా 106.02 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. రెండు నెలల క్రితం రేవంత్ సర్కార్ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ప్రారంభించింది. ఈ పథకం ఇప్పటికే గ్రాండ్ సక్సెస్ అయింది. ఎక్కువగా హైదరాబాద్‌తో పాటు వేములవాడ, కాళేశ్వరం సహా వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే రూట్లలో ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారు. మొత్తంగా ఈ అద్భుత అవకాశాన్ని మహిళలు చక్కగా వినియోగించుకుంటున్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఒకటి. ఈ హామీ అమలుపై సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీసీ ఎండీతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సోనియా గాంధీ పుట్టిన రోజు అయిన డిసెంబర్ 9 నుంచి అమలులోకి తీసుకొచ్చారు. మహాలక్ష్మి పథకం అమలుతో.. 60 శాతం మంది మహిళలు ఉచిత ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం టీఎస్ఆర్టీసీ వద్ద అద్దె వాటితో కలిపి మొత్తం 9,100 బస్సులున్నాయి. ఉచిత ప్రయాణం వల్ల రోజువారీ అదనపు ప్రయాణికుల సంఖ్య 12 లక్షల నుంచి 15 లక్షలకు చేరింది. మహాలక్ష్మి పథకం మొదలైన తర్వాత ఆర్టీసీకి అదనంగా 150 బస్సులు సమకూరాయి. ఇంకా 4 వేల అదనపు బస్సులు కావాల్సి ఉంది. దీంతో కొత్త బస్సులు కావాలని ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. 2,000 మంది డ్రైవర్లను ఉన్నపళంగా రిక్రూట్ చేసుకోవాలని ప్రతిపాదించారు. దాంతో ప్రభుత్వం దశల వారీగా కొత్త బస్సుల్ని ప్రవేశపెడుతోంది. వీలైనంత త్వరగా ఎక్కువ బస్సుల్ని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది.

## కేజ్రీవాల్‌కు మరోసారి

# ఈడీ నోటీసులు

## - ఈ నెల 19న హాజరుకావాలని సమన్లు



లిక్కర్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్‌కు మరోసారి ఈడీ నోటీసు ఇచ్చింది. ఈ నెల 19న హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. ఇప్పటికే కేజ్రీవాల్‌కు ఐదుసార్లు ఈడీ నోటీసులు ఇచ్చింది. కానీ ఆయన ఇప్పటి వరకు విచారణకు హాజరుకాలేదు. ఇలా దాదాపుగా ఐదుసార్లు విచారణకు డుమ్మా కొట్టారు. దీంతో ఈడీ అధికారులు కోర్టును ఆశ్రయించగా విచారణకు కేజ్రీవాల్ సహకరించాలని తెలిపింది. దీంతో లిక్కర్ పాలసీ కేసులో మరోసారి కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఇంతకుముందు 2023 నవంబర్ 2, డిసెంబర్ 21, 2024 జనవరి 3, జనవరి 18, ఫిబ్రవరి 2 తేదీల్లో ఈడీ కేజ్రీవాల్‌కు సమన్లు పంపింది. తాజాగా మరోసారి బుధవారం నోటీసులు ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల ముందు ఈడీ నోటీసులు ఇవ్వడాన్ని ఆప్ తప్పుపడుతోంది. ఉద్దేశ పూర్వకంగానే ఈడీని బీజేపీ అడ్డంపెట్టుకుని వేధిస్తోందని ఆప్ ఆరోపిస్తోంది. తాజా నోటీసుపై కేజ్రీవాల్ ఎలా స్పందిస్తారో చూడాలి. ఆరోసారి కూడా విచారణకు కేజ్రీవాల్ డుమ్మా కొడతారా? లేదంటే హాజరవుతారా? అన్నది వేచి తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే లిక్కర్ పాలసీ కేసులో మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా జైల్లో ఉన్నారు. కొన్ని నెలల నుంచి తీహార్ జైల్లో ఉంటున్నారు. పలుమార్లు ఆయనకు కోర్టు బెయిల్ నిరాకరించింది. అయితే ఇటీవల వివాహ కార్యక్రమం నిమిత్తం మాత్రం తాత్కాలిక బెయిల్‌ను సిసోడియాకు మంజూరు చేసింది. జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కూడా జైల్లో ఉన్నారు. మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ప్రస్తుతం ఆయన జైల్లో ఉన్నారు.

# మేడారం భక్తులకు ఇంటికే ప్రసాదం!




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** మేడారం జాతర ప్రసాదాన్ని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటికి పంపుతామని ఆర్టీసీ తెలిపింది. ఈ మేరకు దేవాదాయశాఖతో సంస్థ లాజిస్టిక్స్ విభాగం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో ఆర్టీసీకి చెందిన అన్ని కార్గో (లాజిస్టిక్స్) కౌంటర్లలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, బస్‌డిపోల పరిధిలో విధులు నిర్వహించే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లనూ సంప్రదించవచ్చని సూచించింది. లాజిస్టిక్స్ కేంద్రాలకు వెళ్లలేని భక్తులు పేటీఎం ఇన్‌సైడర్ పోర్టల్‌లో లేక ఆర్టీసీ యాప్‌లో ఈ నెల 14 నుంచి 25 వరకు మేడారం జాతర ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చని వెల్లడించింది. పూర్తివివరాలకు 040 69440000 నంబర్‌లో సంప్రదించాలని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588